ఆగమేఘాలపై కదిలారు | 50మంది భక్తులను రక్షించిన పోలీసులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 31 : భారీవర్షాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. వాగులు, వంకలు, రహదారుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవాలయం సమీపంలో వాగు వద్ద చిక్కుకున్న 50మంది భక్తులను సురక్షితంగా పోలీసులు తీసుకొచ్చారని తెలిపారు. ట్రాక్టర్‌పై వారిని జాగ్రత్తగా వాగు దాటించారన్నారు. వర్షాల వలన ఎలాంటి ఆపదలో చిక్కుకున్నా ప్రజలు 112, 9121102266 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలకు సహాయక చర్యలు చేసేందుకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

జోరు వానలో..

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

- సిబ్బందికి తోడు కూటమి కేడర్
- వైపాలెం సెగ్మెంట్‌లో పాల్గొన్న మంత్రి స్వామి
- తొలిరోజు 89 శాతం మందికి అందజేత





పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో వర్షంలోనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి, పక్కన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు (ఇన్‌సెట్‌లో) గిద్దలూరులో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. జోరువానలోనూ ఉదయం ఆరు గంటల నుంచే జిల్లా అంతటా సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్మును అందజేశారు. వారికి తోడుగా కూటమి కేడర్, ప్రత్యేకించి టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూలై 1న పింఛన్ మొత్తం రూ.4వేలతోపాటు మూడు నెలల బకాయి రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేసింది. రెండో నెల అయిన ఆగస్టు 1న తిరిగి రూ.4వేల వంతున అందజేశారు. ఇక మూడో నెల అయిన సెప్టెంబరు 1న కూడా పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉండగా ఆరోజు ఆదివారం కావడంతో ఒక రోజు ముందు ఆగస్టు 31నే అందజేశారు. జిల్లాలో మొత్తం 2,89,096 మంది వివిధ కేటగిరీల వారికి రూ.123.01 కోట్ల మొత్తం సామాజిక పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుగానే నిధులు మంజూరు చేసింది. శనివారం ఉదయం ఆరుగంటల నుంచే పింఛన్ల పంపిణీని సిబ్బంది ప్రారంభించారు.



ఒంగోలులో పింఛన్ సొమ్మును ఇస్తున్న ఎమ్మెల్యే దామచర్ల



కనిగిరి మండలం గురవాజీపేటలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర



దర్శిలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి



పేర్నమిట్టలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

ఇంటింటికీ వెళ్లి..

జిల్లావ్యాప్తంగా వర్షాలు పడుతున్నా లెక్కచేయకుండా ఉదయం ఆరుగంటలకే సచివాలయ సిబ్బంది వారికి తోడుగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేపట్టారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి వైపాలెం నియోజకవర్గంలోని దేవరాజుగట్టులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, మంత్రి స్వామిలు వర్షంలో తడుస్తూ, బురదమయంగా ఉన్న రోడ్లపై నడుస్తూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సొమ్మును అందజేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హనుమంతునిపాడు మండలం మిట్టపాలెంలో పింఛన్ల పంపిణీని ప్రారంభించి అనంతరం కనిగిరి పట్టణంలోని 9వ వార్డులో అందజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 21వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మేయర్ గంగాడ సుజాత, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాల్లోనూ సాయంత్రం వరకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సిబ్బంది, నాయకులు ఉత్సాహంగా పంపిణీ చేశారు. అలా సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లాలో 89.12శాతంతో 2,57,635 మందికి సుమారు రూ.109.55 కోట్లు పంపిణీ చేశారు మిగిలిపోయిన వారికి సోమవారం ఇవ్వనున్నారు.



కంభంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరువాగు



గుండ్లకమ్మ ఉధృతికి నెమలిగుండ్లలో చిక్కుకున్న భక్తులను ట్రాక్టర్ సాయంతో తీసుకువస్తున్న పోలీసులు

ముసురేసింది

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ముసురు పట్టింది. రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్ పంటలు ముందుకు సాగక ఆందోళన చెందుతున్న జిల్లా రైతులకు ఊరటనిచ్చింది. ఇప్పటికే సాగైన పంటలకు ఊపిరిపోసింది. తదుపరి సాగుపై ఆశలు చిగురింపజేసింది. శనివారం పగటిపూటంతా తెరపి లేకుండా వాన కురవడంతో వనరుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. పశ్చిమప్రాంతంలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. తాజా పరిస్థితితో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్షాల తీవ్రతపై టెలికాన్ఫరెన్స్‌లో ఆరా తీశారు.

- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- వనరుల్లోకి చేరుతున్న నీరు

- పశ్చిమాన పొంగుతున్న వాగులు
- తాజా పరిస్థితిపై మంత్రి, కలెక్టర్లతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- అప్రమత్తంగా ఉండాలని సూచన
- కొత్తపట్నం తీరంలో పర్యటించిన కలెక్టర్ అన్సారియా



ఒంగోలులోని రిమ్స్ ముందు నిలిచిన వర్షపు నీరు

ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ప్రభావం జిల్లాపై గురువారం రాత్రి నుంచి కనిపించింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం కూడా ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 25.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అందులో గరిష్ఠంగా దోర్నాల మండలంలో 42.8 మి.మీ కురిసింది. చీమకుర్తిలో 41.4మి.మీ, మార్కాపురంలో 40.4, మద్దిపాడులో 40.2 మి.మీ పడింది. మరో 20కిపైగా మండలాల్లో 25 నుంచి 40 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. శనివారం పగలంతా జిల్లాలో ముసురుపట్టి వానలు పడ్డాయి. సాయంత్రం ఆరు గంటల సమయానికి ఒంగోలు మండలంలో ఏకంగా 97.75 మి.మీ నమోదు కాగా ముండ్లమూరులో 86.0, కురిచేడులో 82.0, చీమకుర్తిలో 67.0, మార్కాపురంలో 63.5, దొనకొండలో 58.0, కేకేమిట్లలో 57.0, పొదిలిలో 54.5, మార్కాపురంలో 53.0, కొండపిలో 52.0, ఒంగోలు నగరంలో 51.25 మి.మీ కురిసింది. ఇతర మండలాల్లోనూ మంచి వానలే పడ్డాయి. దీంతో పలుప్రాంతాల్లో కుంటలు, చెరువులు, వాగులు, వంకలు ఇతర వనరుల్లోకి నీరు చేరుతోంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

టోల్‌ఫ్రీ నెంబరు 1077

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు. దీనికి టోల్‌ఫ్రీ నంబర్ 1077ను కేటాయించారు. ఇది సోమవారం వరకూ అందుబాటులో ఉంటుంది. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పశుసంవర్ధకశాఖ, వైద్యశాఖల ఉద్యోగులు ఈ రూంలో పనిచేస్తారు. వర్షాలతో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కోరారు.



పొదిలి నగర పంచాయతీ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు



కొత్తపట్నంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఉధృతంగా గుండ్లకమ్మ, ఇతర వాగులు

పశ్చిమప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీవర్షంతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్ద గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించగా కొందరు భక్తులు గుడి వద్ద చిక్కుకుపోయారు. ఆ సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పుల్లలచెరువు మండలం ఐటీవరం వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండగా గుండ్లకమ్మలోకి నీరు చేరుతోంది. కాగా జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాలలో సాగైన కంది, పత్తి, మిర్చి, ఇతర పంటలకు ప్రస్తుత వర్షాలు జీవం పోశాయి. తదుపరి వరి, పొగాకు, మినుము, మొక్కజొన్న ఇతరత్రా పంటలు సాగుకు ఉపయుక్తం కానున్నాయి.

అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు మంత్రి స్వామి ఆదేశం
- వర్షాలపై ఫోన్‌లో సమీక్ష

కొండపి, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌తోపాటు వివిధ శాఖల అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పశ్చిమ ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నందున ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద వాహనాల రాకపోకలను నిలువరించాలన్నారు. ఎటువంటి విపత్తు సంభవించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైన సహాయక చర్యలకు సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత జిల్లా అధికారిని ఆదేశించారు. అధికారులంతా కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతేనే బయటకు రావాలని మంత్రి స్వామి విజ్ఞప్తి చేశారు.

రంగంలోకి దిగిన యంత్రాంగం

తాజా వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడారు. జిల్లాలో పరిస్థితిని అడిగి తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో వర్షాల వల్ల ఎదురయ్యే పారిశుధ్యం, వ్యాధులు, రోడ్లు, విద్యుత్ అంతరాయం తదితర అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇదిలా ఉండగా కొత్తపట్నం తీర ప్రాంతంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించారు.

కారుమంచి సొసైటీ సీఈవోపై వేటు

- ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగింపు
- ఉత్తర్వులు జారీచేసిన జాయింట్ కలెక్టర్
- రూ.55.74లక్షలు దిగమింగిన ఫలితం

ఒంగోలు(విద్య), ఆగస్టు 31: టంగుటూరు మండలం కారుమంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) ఆత్మకూరి శ్రీకాంత్‌పై వేటు పడింది. సొసైటీ నిధులు రూ.55.74 లక్షలను దిగమింగినందుకు ఆయన్ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించారు. సొసైటీలో చోటుచేసుకున్న అక్రమాలపై జరిగిన విచారణలో శ్రీకాంత్ దోషిగా తేలారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకునేందుకు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి పలుమార్లు నోటీసులు జారీచేసినా సీఈవో స్పందించలేదు. దీంతో శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగించేందుకు అనుమతించాలని సొసైటీ పీఐసీ మాలకొండయ్య జిల్లా స్థాయి ఎంపవర్‌మెంట్ కమిటీకి నివేదించారు. దీంతో పీడీసీసీ బ్యాంకు అధికార పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర గోపాలకృష్ణ అధ్యక్షతన డీఎల్ఈసీ సమావేశం నిర్వహించి శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఆమోద ముద్ర వేసింది.

రూ.55.74 లక్షలు గోల్‌మాల్

కారుమంచి సొసైటీలో సీఈవో శ్రీకాంత్ భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ఆరేళ్లపాటు సొసైటీ ఆడిట్ జరగకుండా అడ్డుకున్నారు. సొసైటీలో మూడేళ్ల రికార్డులను మాయం చేశారు. అనంతరం అప్పటి డీసీవో రాజశేఖర్ చొరవతో ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌లో భారీ మొత్తంలో నిధులు గల్లంతైనట్లు తేలింది. దీంతో ఆ అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఒంగోలు డీఎల్‌సీవో కార్యాలయ అదనపు రిజిస్ట్రార్ కోట వీరయ్యను నియమించారు. విచారణలో శ్రీకాంత్ సొసైటీ నిధులు రూ.55.74 లక్షలు స్వాహా చేసినట్లు తేలింది. 45మంది రైతుల నుంచి వసూలు చేసిన రూ.43.18 లక్షలు బ్యాంకులో జమ చేయకుండా దిగమింగారు. బకాయి మొత్తం వసూలు చేయకుండా మార్టిగేజ్ బాండు విడుదల చేసి రూ.58,500, పీడీసీసీబీ ఎం.నిడమనూరు శాఖ నుంచి రూ.6లక్షలు స్వాహా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జీతాల పేరుతో రూ.50,698, మరోసారి రూ.1.20 లక్షలు, ఇంకోసారి రూ.4.18 లక్షలు డ్రా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మొత్తాన్ని 18శాతం వడ్డీతో శ్రీకాంత్ నుంచి వసూలు చేయాలని విచారణాధికారి సిఫార్సు చేశారు.


ప్రాసిక్యూషన్‌కు అనుమతి

సొసైటీ నిధులు స్వాహా చేసినందుకు శ్రీకాంత్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. దీంతో శ్రీకాంత్‌పై టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదైంది. శ్రీకాంత్ స్వాహా చేసిన మొత్తాన్ని అతని నుంచి వసూలు చేసేందుకు ఒంగోలు డివిజనల్ సహకారాధికారి రాజశేఖర్ సర్‌చార్జి నోటీసులు జారీ చేశారు. సర్‌చార్జి విచారణకు శ్రీకాంత్ డుమ్మా కొట్టారు. దీంతో జేసీ ఉత్తర్వుల మేరకు శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ సొసైటీ పీఐసీ మాలకొండయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఇదేవిధంగా సొసైటీల్లో దీర్ఘకాలంగా తిష్టవేసి నిధులను కైంకర్యం చేసిన మరికొందరు సీఈవోలపైనా వేటు పడనున్నట్లు తెలిసింది.

ఎట్టకేలకు కదలిక

డీపీవో ఆఫీసులో డిప్యుటేషన్ రద్దు

సీసీగా ఉన్న గ్రేడ్-6 కార్యదర్శి రిలీవ్



ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 31 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై డీపీవో సీసీగా పనిచేస్తున్న పి.సాయికోటేశ్వరరావును రిలీవ్ చేశారు. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారి టి.ఉషారాణి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి (డిజిటల్ అసిస్టెంట్) గ్రేడ్-6గా పనిచేస్తున్న సాయి కోటేశ్వరరావు గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పంచాయతీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. చెరుకూరులో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ఇబ్బందులుపడాల్సి వస్తోందని, సాయికోటేశ్వరరావును రిలీవ్ చేయాలని ఇటీవల పొన్నలూరు ఎంపీడీవో డీపీవోకు లేఖ రాశారు. అయినా సాయికోటేశ్వరరావును రిలీవ్ చేయకుండా కొనసాగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు డీపీవో శనివారం అతనిని రిలీవ్ చేశారు.

కార్యాలయంలో ఇష్టారాజ్యం

డీపీవో కార్యాలయంలో పనిచేసే సీనియర్ ఉద్యోగుల కన్నా జూనియర్‌గా ఉండే సాయికోటేశ్వరరావు తాను చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరుగా పంచాయతీ కార్యదర్శులకు ఫోన్లు చేసి ఇష్టారీతిన మాట్లాడతారన్న విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో సీనియర్ ఉద్యోగులను సైతం బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆయన్ను రిలీవ్ చేశారు.

మళ్లీ ఇక్కడకు తెస్తానని భరోసా

రిలీవ్ చేసిన వెంటనే మళ్లీ ఒంగోలుకు తీసుకొస్తానని ఉన్నతాధికారి భరోసా కల్పించినట్లు సమాచారం. ఇప్పటికే డీపీవో కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న కోటేశ్వరరావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కార్యాలయంలో కూడా ఇష్టారీతిన వ్యవహరిస్తారనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో మళ్లీ డిప్యుటేషన్‌పై తెస్తామని ఉన్నతాధికారే చెప్పడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర డిప్యుటేషన్లు రద్దు చేయరా?

సాధారణ బదిలీల సమయంలో కార్యాలయాల్లో ఎవరైనా డిప్యుటేషన్‌పై పనిచేస్తుంటే అటువంటి వారిని వారి పాత స్థానాలకు పంపించాల్సి ఉంది. కానీ జిల్లా పంచాయతీశాఖలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు 70మందికిపైగా కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు డిప్యుటేషన్లపై పనిచేస్తున్నా ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.



చీమకుర్తి హాస్టల్లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

గుడ్లవల్లేరు ఘటన వెనుక వైసీపీ కుట్ర

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్ ఆకస్మిక తనిఖీ

చీమకుర్తి, ఆగస్టు 31 : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటన వెనుక వైసీపీ కుట్ర ఉన్నట్లు తాము అనుమానిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. చీమకుర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోవాలని డీడీ లక్ష్మానాయక్‌ను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు అధ్వానస్థితిలో ఉండటం, ట్యాప్‌లు పనిచేయకపోవడాన్ని చూసి సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యవైఖరి వల్లనే రాష్ట్రంలో హాస్టళ్లకు ఈ దుస్థితి పట్టిందన్నారు. హాస్టళ్లలో భద్రత, పరిశుభ్రత, వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్ పాల్గొన్నారు.


21వ డివిజన్‌లో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్


దివ్యాంగునికి పింఛను నగదును అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా


దొడ్డవరప్పాడులో పింఛను అందిస్తున్న టీడీపీ నాయకులు

పెంచిన పింఛన్లతో పేదల కళ్లల్లో ఆనందం

• ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 31 : పెంచిన పింఛన్లతో పేదల కళ్లలో ఆనందం కనిపిస్తుందని, ప్రత్యేకించి నెల పూర్తి కాకముందే ఒక రోజు ముందే పింఛను నగదు అందించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం పండుగవాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరం 21వ డివిజన్‌లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల హాజరై మాట్లాడారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఒకవైపు జోరుగా వర్షాలు కురుస్తుండగా, మరోవైపు సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదని ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంటే ఒక నెలలోనే రెండుసార్లు పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని దామచర్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా..

కాగా కలెక్టర్ తమీమ్ అన్సారీయా నగరంలోని పలు డివిజన్లలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

పేర్నమిట్టలో ఎమ్మెల్యే బీఎన్..

పేదల సంక్షేమమే టీడీపీ కూటమి ధ్యేయమని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక 41వ డివిజన్ పేర్నమిట్టలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు రూ.4వేలు పింఛను అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, పత్తిపాటి శ్రీనివాసరావు, కందుకూరు వాసు, పేర్నమిట్ట పవన్ పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం గ్రామాల్లోని లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు. దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, పాటిబండ్ల అజయ్, ముళ్లూరు మురళి, చుండూరి రఘురాం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెల్లంపల్లిలో సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ఎంపీటీసీ లక్ష్మీదుర్గభవాని, వేణురాజు, ముచ్చు సుబ్బారావు పింఛన్లను పంపిణీ చేశారు. మద్దిపాడులో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఆశాలక్ష్మి పంపిణీ చేశారు. బసవన్నపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, కొలచనకోటలో దేవబత్తిన ప్రసాద్‌రావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, సచివాలయ ఉద్యోగులు పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

• ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 31: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, వాటిని వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. అభినవ భారత్, మడియా సంస్థ, ఆస్టోనా ఆధ్వర్యంలో యాంటి డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని శనివారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ అభినవ భారత్ వ్యవస్థాపకుడు అయిన ఆస్టోనా భాను సమాజానికి మంచి చేయాలినే ధృడసంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. దేశ భవిష్యత్ యువతపై ఉందని తెలిపారు. క్విస్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ నిడమనూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ డ్రగ్స్ వైపు తమ మనసు వెళ్ళనీయకుండా యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అప్పుడే జీవతంలో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, క్విస్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, హెచ్‌వోడీ జి.శ్రీనివాసులు, అభినవ భారత్ ప్రతినిధులు వెంకటరావు, మాదాల వేణు, మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

12 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

ఒంగోలు(విద్య), ఆగస్టు 31: జిల్లాలో 12 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు మూడోసారి వాయిదాపడ్డాయి. మొదట ఆగస్టు 8న జిల్లాలోని 2,405 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ కాగా 99 పాఠశాలల్లో కొన్నింటికి కోరంలేక, కొన్ని పాఠశాలలు కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఎన్నికలు నిలిచిపోయిన 99 పాఠశాలలకు ఆగస్టు 17న ఎన్నికల నిర్వహణ చేపట్టగా కోరం లేక 25 పాఠశాలల్లో రెండో సారి ఎన్నికలు వాయిదాపడ్డాయి. వీటిల్లో ఐదు పాఠశాలల్లో విద్యార్థులు లేక పోవడం, 12 పాఠశాలలు మూతవేయడం వల్ల 20 పాఠశాలలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ పాఠశాలలకు ఆగస్టు 31లోపు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల నిర్వహణ తేదీన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఇష్టానికే వదిలేశారు. జిల్లాలో మిగిలిపోయిన 20 పాఠశాలలకు ఎస్ఎంసీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించగా ఎనిమిది పాఠశాలల్లో పూర్తయ్యాయి. మిగిలిన 12 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు నిలిచిపోయినట్లు డీఈవో డి.సుభద్ర తెలిపారు.

ఎమ్మెల్యే బీఎన్ ప్రత్యేక పూజలు


స్వామివారికి పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 31: నాగులుప్పలపాడులో వేంచేసిన శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ 12వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మారెళ్ల వెంకట శేషయ్య, మారెళ్ల కిరణ్, చలపతి, కొంజేటి ధనుష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కలెక్టర్ చంద్రయ్య ఆదర్శనీయుడు

నాగులుప్పలపాడు ఆగస్టు 31: మాజీ కలెక్టర్ కత్తి చంద్రయ్య జీవితం ఆదర్శనీయమని మాజీ సర్పంచ్ నార్నె అంజయ్య పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్ కత్తి చంద్రయ్య శత జయంతి సందర్భంగా ఆయన కుమారుడు ప్రఫుల్‌చంద్ర శనివారం పోతవరం ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి సమకూర్చిన వైద్య పరికరాలను నార్నె అంజయ్య చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కత్తి చంద్రయ్య, విమలాబాయి దంపతులు గ్రామంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. ఇప్పుడు ఆయన కుమారుడు ప్రఫుల్‌చంద్ర సైతం వైద్యశాలకు విలువైన వైద్యపరికరాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కులదీప్, ఫార్మాసిస్ట్ సీహెచ్.రత్నకుమార్, పోతవరం గ్రామ సంఘం వ్యవస్థాపక సమన్వయకర్త రావిపాటి రామాంజనేయులు, ప్రముఖ కవి కత్తి కళ్యాన్, బెజవాడ రాఘవరావు, దాచర్ల హనుమంతరావు, పెద్దిపోగు రమేష్, జిల్లెలమూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు ఎస్పీ సత్కారం

ఒంగోలు(క్రైం), ఆగస్టు 31: పోలీస్‌శాఖలో ఉద్యోగ విరమణ చేసిన పలువురు అధికారులను ఎస్పీ ఏఆర్.దామోదర్ ఘనంగా సత్కరించారు. శనివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, ట్రాఫిక్ ఎస్సై వి.డేవిడ్, పోలీస్ కంట్రోలు రూమ్‌లో పనిచేసిన ఎస్‌డీ.మీరాసాహెబ్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖ నిత్యం అండగా ఉంటుదని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత : పోలీస్‌శాఖలో పని చేస్తూ మృతి చెందిన పోలీస్, హోంగార్డు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన అబ్దుల్‌రహీం సతీమణి షాహిన్‌కు ఫ్లాగ్ ఫండ్ రూ.25వేలు, నెమలిరెడ్డి సతీమణి రాధకు రూ.25వేలు, హోంగార్డు బి.డేవిడ్ భార్య శారదకు వెల్ఫేర్ ఫండ్ రూ.15వేలు, ఐ.కొండలు భార్య మాధవికి రూ.20 వేల చెక్కులను ఎస్పీ చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరావు, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, రామరాజు, లక్ష్మీనారాయణ, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పొంగిన కొత్తకోట వాగు


వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

నాగులుప్పలపాడు ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తకోట వాగు పొంగి ప్రవహిస్తోంది. నాగులుప్పలపాడు- తిమ్మనపాలెం రహదారిలోని కొత్తకోట వాగుకు భారీగా వరద చేరి శనివారం మధ్యాహ్నం నుంచి నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ శ్రీకాంత్ కొత్తకోట వాగు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

మద్దిపాడు, ఆగస్టు 31: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శివరామయ్య తెలిపారు. శనివారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ విగ్రహం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, నిమజ్జన సమయం వివరాలు అందజేయాలన్నారు. మండపాల వద్ద పార్టీల జెండాలు పెట్టకూడదని, డీజేలకు అనుమతి లేదని చెప్పారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• కలెక్టర్ తమీమ్ అన్సారియా
• పలు గ్రామాల్లో పర్యటన
• మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన

ఒంగోలు నగరం, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారిన నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవటంతో పాటు 55 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో తీరం వెంట బలమైన గాలులు విస్తాయంటూ తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఇచ్చిన సమాచారం మేరకు జిల్లాలో తీర ప్రాంత గ్రామాల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. శనివారం సాయంత్రం కొత్తపట్నం మండలం కెపల్లెపాలెం, మోటుమాల, గుండమాల తీరప్రాంత గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ షెల్టర్లను వెంటనే శుభ్రం చేసి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కోరారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు, గర్భిణుల పట్ల అత్యంత వేగంగా స్పందించాలన్నారు. గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తమనిస్తూ జిల్లా కేంద్రానికి సమాచారం అందజేయాలన్నారు. మత్స్యశాఖ, రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పశుసంవర్థకశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాగా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని మత్స్యకారులు శనివారం వేటకు వెళ్లలేదు. సముద్రంలో అలలు సాధారణం కంటే ఎత్తుకు ఎగిసి పడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీర ప్రాంత గ్రామాల్లో చలి వాతావరణంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. తీరం వెంట ఉన్న గ్రామాల్లో బలమైన ఈదురు గాలులు వీచాయి. మత్స్యకారులు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. పడవలను రెండు రోజుల ముందుగానే మత్స్యకారులు ఒడ్డుకు చేర్చుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో మండల సుజాత తదితరులు పాల్గొన్నారు.


తుఫాన్ షెల్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'క్విక్ రెస్పాన్స్ టీమ్'

కమిషనర్ వెంకటేశ్వరరావు

తుఫాన్ ఇబ్బందులపై హెల్ప్‌లైన్ నెంబర్ : 08592-227766

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన తుఫాను నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను నియమించినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల నుంచి ప్రత్యేక టీమును నియమించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ ముప్పు తప్పే వరకు సెలవులు రద్దు చేసినట్లు తెలిపారు. వర్ష ప్రభావం కారణంగా నగరంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా శివారుకాలనీలపై దృష్టి సారించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని చెప్పారు. వర్షపు నీరు నిల్వ లేకుండా, కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించకుండా అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. క్విక్ రెస్పాన్స్ టీముపై పర్యవేక్షకులుగా ఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ ప్రాంతంలో వర్షం కారణంగా ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ నెంబరు 08592-227766కి ఫోన్‌చేసి తెలియజేయాలని ఆయన కోరారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

బదిలీలను వాయిదా వేయడంపై హర్షం

వాణిజ్యపన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు నరసింగరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: వాణిజ్య పన్నులశాఖలో ఉద్యోగుల బదిలీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక, వాణిజ్యపన్నులశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తాత్కాలికంగా వాయిదా వేయడంపై వాణిజ్యపన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు జాజుల నరసింగరావు కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల బదిలీలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ భవన్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కూడా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వాణిజ్యపన్నులశాఖలో 2.0 ఆర్గనైజేషన్ పేరుతో రాజ్యాంగం, రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేస్తూ సిబ్బందిని వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్ స్థానాలకు బదిలీ చేసి తిరిగి సర్కిల్ వ్యవస్థకు తీసుకొని రావాలని కోరారు. అసోసియేషన్ చేపట్టిన ఆందోళలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి బదిలీలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తోట కిరణ్‌కుమార్, కరిచేటి సుధాకర్, బి.రవికుమార్, అహ్మద్‌బాషా, వంశీ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

నగరంలో జోరు వాన..!

శివారు కాలనీల్లో పర్యటించిన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

సహాయక చర్యలు వేగవంతం


వెంగముక్కపాలెం జంక్షన్ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్



చెరువును తలపిస్తున్న భాగ్యనగర్ రోడ్డు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 31: అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఒంగోలు నగరం జలమయం అయింది. గత గురువారం రాత్రి నుంచి మొదలైన వాన నగరాన్ని ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు ప్రధాన వీధుల్లో వర్షం నీరు ఏరులై పారగా, చెరువులను తలపించాయి. ఇక శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రత్యేకించి, నెహ్రూకాలనీ, బిలాల్‌నగర్, నేతాజీకాలనీలలో పలు గృహాలు నీటిలో ఉండటంతో అక్కడి ప్రజలు ఇళ్ళలో కూడా ఉండలేని పరిస్థితి కనిపించింది. దీంతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారీయా శివారుకాలనీల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడిక తీయడం ద్వారా సమస్య తీవ్రతను తగ్గించవచ్చని సూచించారు. ముఖ్యంగా ఎప్పటికప్పుడు శివారుకాలనీల్లో పర్యటించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యే దామచర్ల ఆదేశించారు.

నగరాన్ని ముంచెత్తిన వాన

మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో ప్రజలు పాట్లు తప్పలేదు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ళ లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. అంతేగాకుండా భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జఠిలమైంది. దారావారితోట, దేవుడుచెరువు, సీఎస్‌ఆర్ శర్మాకళాశాల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసి డిపో ఆవరణం, ఏకలవ్య నగర్, మస్తాన్ దర్గా సెంటర్, భాగ్యనగర్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందుల పడ్డారు. అలాగే ముసురుతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


ప్రగతిభవన్ వద్ద భారీగా నిలిచిన వర్షపునీరు

కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు

జోరువాన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలు, నగరంలోని వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు. ఈ మేరకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆయా ప్రాంతాలకు చేరుకుని అక్కడ వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నాలు చేశారు. పోతురాజుకాలువ, వెంకటేశ్వరకాలనీ, నేతాజీకాలనీ, జర్నలిస్ట్ కాలనీల్లో పరిస్థితి మరింతదారుణంగా ఉండగా, ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి ప్రధాన డ్రెయిన్‌లలో పూడిక తీత పనులు చేపట్టి, వర్షపు నీటిని దారి మళ్ళించారు.

అవీ..ఇవీ..

వర్షంతో విద్యార్థులకు పరీక్ష వాయిదా

• కలెక్టర్ ప్రకటన

ఒంగోలు(విద్య), ఆగస్టు 31 : జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుడా వర్షం పడుతుండటంతో పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం జరగాల్సిన పరీక్షను ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. వర్షం కారణంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా కలెక్టర్ పాఠశాలలకు సెలవు ప్రకటించినందున, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులను వారి ఇళ్లకు పంపించాలని డీఈవో సుభద్ర ఎంఈవోలు, ఉప విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరే వరకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని డీఈవో కోరారు.

12 ఏళ్ల తర్వాత కారుణ్య నియామకం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన రామకృష్ణ సోదరుడు ఏడుకొండలుకు కారుణ్య నియామకం కింద 12 ఏళ్ళ తర్వాత కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉద్యోగం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మర్రిపూడి మండలం చిమట గ్రామానికి చెందిన నావూరి రామకృష్ణ పుట్టకతో మూగ కావడంతో తల్లిదండ్రులు చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెంలో నివాసం ఉంటున్నారు. జిల్లా సహకారశాఖలో టైపిస్టుగా ఓపెన్ కాంపిటేషన్‌లో ఉద్యోగం రావడంతో ఒంగోలులో చేస్తున్నారు. 12ఏళ్ళ క్రితం మర్రిచెట్లపాలెంలోని బహిర్భూమికి వెళ్లిన రామకృష్ణ కాలుజారి గ్రానైట్ క్వారీలో పడి చనిపోయారు. అయితే ఆయన మరణంతో వారికుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉంది. మృతుని కుటుంబ సభ్యులు అప్పటి నుంచి జిల్లా అధికారులను కలుస్తూ వస్తున్నా ఉద్యోగ నియామకం ఇవ్వలేదు. ఇటీవల కలెక్టర్‌గా వచ్చిన తమీమ్ అన్సారియాను కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ సహకారశాఖలో మృతుని సోదరుడికి ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో తల్లిదండ్రులు నావూరి అంజమ్మ, వెంకటస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీస్‌చట్టం

ఒంగోలు(క్రైం), ఆగస్టు 31: ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీస్ చట్టం అమలులో ఉందని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈనెల 1 నుంచి 30 వరకు ఈ చట్టం అమలులో ఉంటుదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు పోలీసు అనుమతి లేకుండా జరపకూడదని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు గౌరవించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

జిల్లాలో 25.1 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 25.1మి.మీ వర్షపాతం నమోదైంది. దోర్నాల మండలంలో 42.8, చీమకుర్తి 41.4, మార్కాపురం 40.4, మద్దిపాడు 40.2, ఒంగోలు 36.6, పెద్దారవీడు 36.6, త్రిపురాంతకం 36.6, దర్శి 36.2, నాగులుప్పలపాడు 34.2, కురిచేడు 32.0, యర్రగొండపాలెం 32.0, గిద్దలూరు 30.8, ముండ్లమూరు 30.4, కేకే మిట్ల 30.4, దొనకొండ 30.0, తాళ్ళూరు 29.2, పొదిలి 29.2, పుల్లలచెరువు 26.0, హనుమంతునిపాడు 24.0, సంతనూతలపాడు 23.2, సింగరాయకొండ 22.4, వెలిగండ్ల 22.2, కొండపి 21.6, కనిగిరి 20.0, పామూరు 19.8, రాచర్ల 19.2, కంభం 18.4, సీఎస్‌పురం 18.2, తర్లుబాడు 17.6, పీసీపల్లి 17.2, కొత్తపట్నం 16.8, జరుగుమల్లి 16.4, పొన్నలూరు 16.2, కొమరోలు 13.4, బేస్తవారిపేట 13.2, ఇకటంగుటూరు 8.4, మర్రిపూడి 6.2, అర్ధవీడు 6.2 మి.మీ వర్షం కురిసింది.

పేస్‌లో సాఫ్ట్‌వేర్ టెస్టింగ్‌పై సదస్సు

ఒంగోలు(విద్య), ఆగస్టు 31 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సాఫ్ట్‌వేర్ టెస్టింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్వాలిటెస్ట్‌లో సీనియర్ టెస్ట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గంగినేని రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో అందరూ డెవలప్‌మెంట్ వైపు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అయితే టెస్టింగ్‌రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. ఆటోమేషన్ టెస్టింగ్‌లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, విభాగాధిపతి ఎస్.గిరిబాబు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆది, సోమవారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగేపలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం ఉదయం పది గంటలకు స్థానిక కాపు కళ్యాణ మండపంలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి మాగుంట పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ : వీసీ

ఒంగోలు(విద్య), ఆగస్టు 31 : మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కల వలన మానవాళికి అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్, డీన్ సోమశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 31: మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఏడుగుండ్లపాడులోని హర్షిణీ కళాశాల వద్ద జరిగింది. ఒంగోలు నుంచి మేదరమెట్ల వెళ్తున్న మోటార్‌సైకిల్ కారును అధిగమించబోయి అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో మేదరమెట్లకు చెందిన పి.మోజేష్‌బాబు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి దిగువకు జలాలు

మద్దిపాడు, ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో కురిసి వర్షాలకు గుండ్లకమ్మ జలాశయానికి వర్షపు నీరు భారీగా చేరుకుంది. ఒక టీఎంసీ నీరు చేరుకోవడంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయి నీటిమట్టం 24.8 మీటర్లు. ప్రాజెక్టు గేట్లకు స్టాప్ లాక్కులు అమర్చారు. గేట్ల మరమ్మతులు ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి 3 వేల క్యూసెక్కులు నీరు వస్తుండగా నాలుగు గేట్ల ద్వారా నీటిని బయటకు వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ రామాంజనేయులు శనివారం తెలిపారు. ప్రాజెక్టు కాలువలకు నిధులు విడుదల కావటంతో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు కాలువల మెయింటెనెన్స్ చేస్తామని అయన పేర్కొన్నారు.

రైజ్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు(విద్య), ఆగస్టు 31 : ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూపు విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ మూడవ, నాల్గవ సంవత్సరం సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హ్యూమనైడ్ రాబోట్ వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన టీఎస్‌సీ ఎడ్యుబోటిక్స్ సంస్థలో పనిచేస్తున్న పి.సురేంద్రబాబు అడ్వాన్స్డ్ పైథాన్‌లో వివిధ ప్యాకేజీలపై అవగాహన కల్పించారు. రాబోట్‌లు మెడిసిన్, బయోటెక్నాలజీ, బయోమెకానిక్స్, కాగ్నటిక్ సైన్స్‌లో ఎక్కువగా ఉపయోగంలో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎ1 హ్యూమనాయిడ్ రోబోట్ తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులు ఎ1 హ్యూమనాయిడ్ రోబోట్స్ టీచరును తయారు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శిద్దా భరత్, గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, రాగా చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, విభాగాధిపతులు పి.ఐజాక్‌పాల్, ఎస్‌వీ.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలోని వసతిగృహాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఆగస్టు 31: కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలను తహసీల్దార్ మధుసూదనరావు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బాలికలవసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థినులను కోరారు. అనంతరం బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థుల సంఖ్య, గదులు, వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్‌వో కోటేశ్వరరావు, ఆర్ఐ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరు హైస్కూల్‌కు చేరుకున్న కూలీలు

25 మంది సురక్షిత ప్రాంతానికి తరలింపు

ఆలకూరపాడు (టంగుటూరు) 31 : ఆలకూరపాడు పంచాయతీలోని పాతపుల్లారెడ్డిపాలెంలో గుడారాలలో నివాసం ఉంటూ ఆప్రాంతాల్లో పనులకు వెళ్తున్న 25 మందిని శనివారం తహసీల్దార్ అంజనేయులు టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేర్చారు. భారీ వర్షాలకు వీరి గుడారాలలో నీరు ఉరుస్తూ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు తహసీల్దార్ దృష్టికి వచ్చింది. అలాగే ఆలకూరపాడు-పాతపుల్లారెడ్డిపాలెం మధ్య మునిపై కాజ్‌వే ఉంది. మునిలో నీటి ఉధృతి పెరిగితే ఆలకూరపాడు-పాతపుల్లారెడ్డిపాలెం మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఈనేపథ్యంలో తహసీల్దార్ వెంటనే వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. వీరికి రాత్రి భోజనాలు అందజేశారు. మండలంలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని, పక్కా గృహాలు లేనివారిని టంగుటూరు తరలించనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. సురక్షిత ప్రదేశం అవసరమైన వారు తమకు తెలియజేయాలని ఆయన కోరారు.

ఎడతెరిపిలేని వర్షం

కొండపి, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం రాత్రి నుంచి ప్రారంభమైన వాన శనివారం సాయంత్రం వరకూ కొనసాగింది.

సాదాసీదాగా మండల సమావేశం

కొండపి, ఆగస్టు 31 : కొండపి మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కె.స్వప్నకుమారి అధ్యక్షతన జరిగింది. వర్షం కారణంగా సాదాసీదాగా ముగిసింది. గతంలో కోరంలేక సమావేశం వాయిదా పడింది. నిర్ణీత గడువు ముగుస్తుండటంతో శనివారం నిర్వహించారు. కోరం సభ్యులు హాజరయ్యారు.


మున్సిపల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

హైడ్రామా

మున్సిపల్ సమావేశానికి రాని వైసీపీ కౌన్సిలర్‌లు

కోరం లేక వాయిదా ప్రకటించిన చైర్‌పర్సన్

వైసీపీ కౌన్సిలర్లను పిలిపించిన టీడీపీ నేతలు

అనంతరం సాగిన వైనం

అద్దంకి, ఆగస్టు 31 : అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం హైడ్రామా మధ్య సాగింది. ఎలాగైనా సమావేశం జరగకుండా చేయాలనుకున్న వైసీపీ కౌన్సిలర్‌ల పన్నాగం బెడిసికొట్టింది. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం ప్రారంభమైంది. అయితే అప్పటికి వైసీపీ కౌన్సిలర్‌లెవరూ హాజరు కాలేదు. టీడీపీకి చెందిన 6గురు కౌన్సిలర్‌లతో పాటు ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్‌లు హాజరయ్యారు. దీంతో కోరం లేనందున సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ తన చాంబర్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు, కౌన్సిలర్‌లు ఎలాగైనా సమావేశం నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చారు. దీంతో టీడీపీ నేతలతో టచ్‌లో ఉన్న ముగ్గురు వైసీపీ కౌన్సిలర్‌లు సమావేశానికి వచ్చేలా చేశారు. దీంతో 11 మంది సభ్యులు హాజరుకావడంతో వైస్ చైర్మన్ ద్వారా సమావేశం నిర్వహించాలని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు కమిషనర్ సత్యనారాయణను కోరారు. విషయం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ వరకు చేరడంతో కొద్దిసేపటి తరువాత వచ్చి సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశం వాయిదా వేసిన తీరుపై పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మను ప్రశ్నించారు. గతంలో పలు సందర్భాలలో సమావేశం ఆలస్యంగా ప్రారంభించడాన్ని గుర్తు చేశారు. అనంతరం మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరయ్యారు. అజెండాలోని 11వ అంశంగా ఉన్న ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో ఏడుగురుని ప్రత్యేకంగా గుర్తించాలన్న అంశం మినహా మిగిలిన అంశాలన్నీ సమావేశంలో ఆమోదించారు.


ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీస్తున్న అధికారులు

జాతీయ రహదారి పక్కన కల్వర్టుకు అడ్డంగా మెరక తోలిన భూమి

కల్వర్టుకు అడ్డంగా మెరక

- నిలిచిన నీటి ప్రవాహం .. చెరువు తెగుతుందని ఆందోళన
- జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది

మేదరమెట్ల, ఆగస్టు 31 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పొలాల్లోని నీరంతా వాగులోకి వచ్చి చేరుతోంది. దీంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న తిమ్మనపాలెం చెరువుకు భారీగా నీరు చేరుతోంది. జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువు అలుగు నుంచి బయటకు వచ్చే నీరు జాతీయ రహదారిని దాటి వాగులో వెళ్లి కలుస్తోంది. జాతీయ రహదారికి తూర్పు, పడమరవైపున ఉన్న పొలాల్లోని నీరంతా, ఈ కల్వర్టు వద్దకే చేరింది. దీంతో ఈ కల్వర్టు వద్ద నీటి ప్రవాహం పెరిగింది. ఈ వేసవిలో కల్వర్టు ఎదురుగా ఉన్న భూమిని దాదాపు ఐదు అడుగులకు పైగా ఎత్తు లేపడంతో ప్రవాహానికి అడ్డంకి ఏర్పడ్డంతో నీరంతా కల్వర్టు వెనుకవైపున నిలిచిపోయింది. తిమ్మనపాలెం చెరువు కూడా నిండుతోంది. పొలాల్లో నుంచి వచ్చే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల చెరువు అలుగు నుంచి వచ్చే నీరు రాకండా ఆగిపోయి చెరువు కట్ట తెగుతుందేమోనని రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు శనివారం ఉదయం నుంచి ఇక్కడకు వచ్చి పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి అధికారులు సర్వీసురోడ్డు కోసం నిర్మించిన కల్వర్టు పక్కగా ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీయడంతో వెనుకవైపు ఉన్న కొంత వరకు తగ్గింది. ఇంకా ఎక్కువ వర్షం కురిస్తే ఈ ప్రమాదం తీవ్రమై జాతీయ రహదారిపై నీరు చేరుతుందని జాతీయ రహదారి అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనంతటికీ కారణం చెరువు అలుగుకు ఎదురుగా ఉన్న భూమిని మెరకలేపటమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అక్కడున్న పక్కపొలాల కన్నా ఈ పొలాన్ని ఐదు అడుగుల కన్న ఎత్తు లేపడంతో నీటి ప్రవాహానికి అడ్డమైంది. భవిష్యత్తులోనైనా ఇక్కడ కాలువను పెద్దది చేసి నీరు సక్రమంగా ప్రవహించడానికి మార్గం ఏర్పాటు చేయకపోతే ఈ ప్రమాదం ఎప్పటికీ పొంచి ఉంటుంది.

శింగరకొండలో యాచకుడు మృతి

అద్దంకి, ఆగస్టు 31 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం సమీపంలో గుర్తు తెలియని యాచకుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు దేవాలయం వెనుక మహిళలు దుస్తులు మార్చుకునే రేకుల షెడ్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని భిక్షాటన చేసే వృద్ధుడు మృతి చెంది ఉండగా, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. బంధువులు, తెలిసిన వ్యక్తులు ఎవరైనా ఉంటే 9121102167, 8978777290 సెల్ నెంబర్‌లను సంప్రదించాలని సీఐ కృష్ణయ్య కోరారు.

స్కూల్ బస్సు బోల్తా

సంతమాగులూరు, ఆగస్టు 31 : కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామంలో ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు ఉన్నారు. వెంటనే గమనించిన పాతమాగులూరు ప్రజలు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. స్వల్పగాయాలతో విద్యార్థులు బయటపడ్డారు.

ఊరూరా పింఛన్‌ల పండగ

వర్షంలోనూ కొనసాగిన పంపిణీ

అన్ని గ్రామాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు

నియోజకవర్గంలో 90 శాతానికి పైగా పూర్తి

కొండపి, ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా ఒకరోజు ముందే పింఛన్‌ల పంపిణీ చేపట్టింది. ఊరూరా పండగలా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందురోజే పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తున్నా పంపిణీని కొనసాగించారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపి మండలంలో 6,322 మంది లబ్ధిదారుల్లో 5,676 (89.78శాతం) మందికి పింఛన్ డబ్బులు అందజేసినట్లు ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. జరుగుమల్లి మండలంలో 6,396 మందికిగాను 5,874 (92.07శాతం) మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జలజాక్షి వెల్లడించారు. పొన్నలూరు మండలంలో 6,200 మందికిగాను 5,608 (90.45 శాతం) మందికి పింఛన్ డబ్బులు అందజేసినట్లు ఎంపీడీవో కల్పన తెలిపారు. రాత్రి కూడా కార్యక్రమం కొనసాగుతున్నదని వారు పేర్కొన్నారు.


జరుగుమల్లి మండలంలోని పైడిపాడులో పింఛన్ డబ్బులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ విజయనిర్మల


ఎం.నిడమలూరులో జోరువానలో గొడుగు సాయంతో పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

టంగుటూరు మండలంలో..

టంగుటూరు : మండలంలో శనివారం సాయంత్రానికి 90శాతానికి పైగా పింఛన్‌ల పంపిణీ పూర్తయ్యింది. సచివాలయ ఉద్యోగులు ఉదయం ఆరు గంటలకే గ్రామాలకు చేరుకొని స్థానిక టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సొమ్మును అందజేశారు. మధ్యాహ్నానికే సూరారెడ్డిపాలెంలో 92.71శాతం, మల్లవరప్పాడులో 91.69శాతం, అనంతవరంలో 88.13శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు. ఆ సమయానికి ఆలకూరపాడులో 69.53శాతం, పొందూరులో 66.09శాతం, టంగుటూరులోని ఒక సచివాలయం పరిధిలో 63.44శాతం, కొణిజేడులో 61.09శాతం మందికి పింఛన్లు అందజేశారు. సాయంత్ర 4.30 గంటల ప్రాంతంలో పరిశీలిస్తే టంగుటూరు-2 గ్రామ సచివాలయ పరిధిలో 92శాతం పంపిణీ పూర్తి చేశారు. టంగుటూరు-1లో 80శాతం, టంగుటూరు-3లో 87శాతం, టంగుటూరు-4లో 82శాతం మందికి అందజేశారు.

గంటగంటకూ మంత్రుల సమీక్ష

ఇటు సొంత జిల్లాలు

అటు రాష్ట్ర పరిస్థితులపై అప్రమత్తం

ఆగమేఘాలపై విద్యార్థులను తరలించిన మంత్రి స్వామి

బెజవాడ, ఉత్తరాంధ్రపై రవికుమార్ దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

భారీవర్షాలు, కొన్ని జిల్లాల్లో వరద పరిస్థితుల ద్వారా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విషయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శనివారం పూర్తిస్థాయిలో ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. గంటగంటకు అధికారులతో పరిస్థితులపై సమీక్ష చేస్తూ అవసరమైన చర్యలకు ఫోన్‌లో మౌఖిక ఆదేశాలు ఇస్తూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి ప్రకాశం జిల్లా వరకు భారీ వర్షాలు కురవటం, విజయవాడ సిటీలో కొండచెరియలు విరిగిపడటం, వరదనీటి ఉధృతం తదితర సమస్యలు తలెత్తటం తెలిసిందే. దీంతో ఉదయం నుంచి ఇద్దరు మంత్రులు ఇటు సొంత జిల్లాల అధికారులతో పాటు అటు ఆయా శాఖల రాష్ట్ర అధికారులను, భారీవర్ష ప్రాంత్ర అధికారులను అప్రమత్తం చేశారు. విజయవాడలో కొండ చెరియలు విరిగిపడే పరిస్థితి ఎదురుకావటం, నగరమంతా వరదనీరు చేరడంతో అక్కడ విద్యుత్ అధికారులను అప్రమత్తం చేయటమే కాక ఇతర ప్రాంత అధికారులు, ఉద్యోగులను అక్కడకు రవికుమార్ పంపించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన రవికుమార్ రాష్ట్ర, జిల్లాల వారీ అధికారుల సమీక్ష రాత్రి 9 గంటల వరకు కూడా కొనసాగుతుంది. అదేసమయంలో సొంత జిల్లా అయిన బాపట్ల జిల్లా పరిస్థితిపై కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష చేశారు. అద్దంకి నియోజకవర్గం తిమ్మన్నపాలెంలో చెరువునీటి ప్రవాహంపై ఎదురైన సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడారు.

వానలోనే తిరిగిన స్వామి

ఇక సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి అయితే వర్షంలోను ప్రజలతో మమేకమై తిరుగుతూనే ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేశారు. వైపాలెం నియోజకవర్గంలోని మారుమూల గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న స్వామి వర్షంలోనూ ఇంటింటికి తిరిగారు. తిరిగి వస్తూ చీమకుర్తిలో హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముగ్గురు ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్నం వండి వడ్డించిన వాచ్‌మన్‌ను అభినందించారు. భారీ వర్ష ప్రాంత జిల్లాల్లో హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు ఎక్కడా సమస్యలు లేకుండా అధికారులను అప్రమత్తం చేశారు. విజయవాడలోని ఒక హాస్టల్‌లోకి భారీగా వరదనీరు ప్రవహించిన సమాచారం తెలుసుకొని ఫోన్‌లోనే అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. వారిని అక్కడ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాటు చేశారు. రాచర్ల మండలంలో దేవాలయానికి వెళ్లి వాగులో చిక్కుకున్న భక్తులను సురక్షితంగా బయటకు తెచ్చేవరకు ఎస్పీ దామోదర్‌తో టచ్‌లో ఉన్నారు. కలెక్టర్ అన్సారియాతో జిల్లాలోని పరిస్థితులపై సమీక్షించారు.

వర్షం.. పైర్లకు జీవం

దర్శి, ఆగస్టు 31: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పైర్లు ఈ వర్షాలకు జీవం పోసుకున్నాయి. గత కొద్దిరోజులుగా తీవ్ర వర్షాభావంతో సాగుచేసిన కంది, సజ్జ, పత్తి తదితర పైర్లు బెట్టకు వచ్చిన విషయం తెలిసిందే. సజ్జ పైరు కంకి తీస్తున్న దశలో ఉంది. వర్షం లేకపోతే పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆందోళనలు చెందుతున్న తరుణంలో విస్తారంగా వర్షం కురవటంతో అన్నీపైర్లు జీవం పోసుకున్నాయి. దీంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. దర్శి ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు గృహాలకే పరిమితమయ్యారు.


దర్శి: వర్షానికి కళకళలాడుతున్న సజ్జ పైరు

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన గొట్టిపాటి లక్ష్మి

దర్శి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం పరిశీలించారు. గతంలో వర్షాలకు పొంగుతూ ప్రవహించే కాటేరు వాగును ఆమె పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడ జరుగుతున్న ఇబ్బందిని గుర్తించి పూడిపోయిన కాటేరువాగు మట్టిని తీయటంతో ఎలాంటి ఇబ్బందిలేకుండా నీటి ప్రవాహం కిందకు వెళ్తుందని తెలిపారు. అలాగే, దర్శి పట్టణంలో మురుగు కాల్వలలో పూడికి తీయించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచినట్లు చెప్పారు. దీంతో రోడ్లపై ఎక్కడా నీరు నిలబడలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వర్షం పడినప్పుడల్లా మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడేవారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పాలనలో మార్పును గుర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపైకి చేరిన నీరు

తాళ్లూరు: మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు జీవం పోసుకున్నాయి. పలు గ్రామాల్లో మురుగు కాల్వలు పూడుకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఓమోస్తరు వర్షం కురవగా, శనివారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వర్షాభావంతో మొక్కజొన్న, కంది, వరి, మిరప ఎండుముఖంపట్టాయి. ఈతరుణంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జీవం పోసుకున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మురుగు కాలువలో పూడికతీత పనులు చేయకపోవటంతో కాలువలు నిండుకుని వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్ల వెంట ప్రవహించింది. దీంతో తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, తాళ్లూరు తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా తహసీల్దార్ పి.శింగయ్య వీఆర్వోలను అప్రమత్తం చేశారు.

ఎడతెరిపిలేకుండా వర్షం

దొనకొండ : మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలుగ్రామాల్లో లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ చప్టాను తహసీల్దార్ రమాదేవి పరిశీలించారు. ఎడతెరపి లేకుండా వర్షం కురిసే సమయంలో ఈచప్టాపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. చప్టాపై వర్షంనీరు ప్రవహిస్తే ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రజలను, వాహనచోదకులను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు.


దొనకొండ: గుండ్లకమ్మ చప్టాను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

చిలకలేరు వాగును పరిశీలించిన తహసీల్దార్, ఎస్ఐ

ముండ్లమూరు : మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి వాగులు పొంగి ప్రవహించే అవకాశాలు ఉండటంతో శనివారం సాయంత్రం తహసీల్దార్ ఎల్ .లక్ష్మీనారాయణ, ఎస్ఐ వై.నాగరాజు పరిశీలించారు. ప్రధానంగా ముండ్లమూరు- వేంపాడు మధ్య చిలకలేరు వాగు, మారెళ్ల- జమ్మలమడక మధ్య ఉన్న ఈదర వాగు, వేముల వాగు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. దీంతో వీఆర్‌వో, వీఆర్ఏ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచినట్లు చెప్పారు. రాత్రుళ్ల వాహన చోదకులు వాగులు దాట వద్దన్నారు. ఏదైనా ప్రమాదం పొంచి ఉన్నట్లయితే 9121102164కు ఫోన్ చేయాలన్నారు.


ముండ్లమూరు - వేంపాడు మధ్య చిలకలేరు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ నాగరాజు

పైర్లకు జీవం పోసిన వర్షం

కనిగిరి : మెట్ట పైర్లకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు జీవం పోశాయని కనిగిరి వ్యవసాయశాఖ ఏడీఏ ఈవీ రమణ తెలిపారు. నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం గోకులం గ్రామంలోని కంది, సజ్జ పైర్లను శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 30మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో 8వేల ఎకరాల్లో కంది, మూడువేల ఎకరాల్లో సజ్జ, ఐదు వందల ఎకరాల్లో వరి, వంద ఎకరాల్లో పొగనారు వేశారని తెలిపారు. ఎండుముఖం పట్టిన పైర్లకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని ఏడీఏ రమణ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

దొనకొండలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

దొనకొండ : విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అత్యవసర సహాయం, సమాచారం నిమిత్తం దొనకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. పాతమిద్దెలు, పాడుబడిన క ట్టడాలు కింద నివసించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఎటువంటి ప్రమాదాలకు గురికా కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి

డీఎంహెచ్‌వో విజయమ్మ

పర్చూరు, ఆగస్టు 31 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు దృష్ట్యా మురుగనీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ అన్నారు. శనివారం నిర్వహించిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆమె పర్చూరు వచ్చారు. గ్రామంలో నిర్వహించిన పింఛన్‌ల పంపిణీని పరిశీలించారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల బెడద పెరిగిపోవడం, ప్రజలు జ్వరాల బారిన పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె పంచాయితీ అధికారులతో కలసి పారిశుధ్య పనులను, మురుగు కాలువలను పరిశీలించారు. బొమ్మల సెంటర్ కూడలిలో ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి రోగాలు ప్రబలకుండా చూడాలని డీఎంహెచ్‌వో విజయమ్మ సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డి రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి మహ్మద్ గౌస్ బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, ఆగస్టు 31 : వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తమై పంటలు కాపాడుకోవాలని ఏవో కుమారి తెలిపారు. శనివారం పలు గ్రామాలలో సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి, వరి పొలాల్లో వరద నీరు ఉంటే బటయకు పంపించాలన్నారు. ఎకరాకు 50 కేజీల యూరియా 20 కేజీల పొటాష్ ఎరువునుపై పాటుగా వేసుకోవాలని ఏవో సూచించారు. కాండం తొలిచే పురుగు అధికం అయ్యే అవకాశం ఉందని రైతులు ప్రిఫనోఫాసి 400 మీల్లి లీటర్లను ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పత్తి సాగు చేసిన రైతులు ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను ఎరువును వేసుకోవాలన్నారు. ఆకు పచ్చ పురుగు వచ్చే ప్రమాదం ఉందని రైతులు వర్షాలు తగ్గిన తదుపరి సాఫ్ అనే శిలింధ్రనాశిని 2 గ్రాముల చొప్పున లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు.

వస్త్ర దుకాణ గుమస్తా బలవన్మరణం

చీరాలటౌన్, ఆగస్టు 31 : చీరాల పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్న వ్యక్తి శనివారం బలవన్మరణం చెందాడు. ఈఘటన చీరాల మండలం పాత చీరాల గ్రామం రామాలయం సమీపంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శవనం అద్దంకిరెడ్డి (43) చాలాకాలంగా పట్టణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య విజయలక్ష్మి, కుమారుడు గోపిరెడ్డి ఉన్నారు. విషయమేమిటో తెలియదు గానీ శనివారం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బంధువులు చెప్తున్నారు.






బోడిచర్ల వద్ద ఉధృతంగా గుండ్లకమ్మ, పెద్దనాగులవరం చెరువును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్, సగిలేరు నదిని పరిశీలిస్తున్న గిద్దలూరు కమిషనర్, పొదిలి పంచాయతీరాజ్ కార్యాలయంలోని చేరిన నీరు

జోరు వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- చెరువులకు చేరుతున్న నీరు
- పలుచోట్ల జనజీవనానికి అంతరాయం

గిద్దలూరు, ఆగస్టు 31 : వాయుగుండం ప్రభావంతో గిద్దలూరు నియోజకవర్గంలో వర్షంతోపాటు చలిగాలులు వీచాయి. శుక్రవారం రాత్రి నుంచి నిరంతరాయంగా సన్నగా శనివారం రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. గిద్దలూరు మండలంలో 30.8 మిమి వర్షపాతం, రాచర్ల 19.2 మి.మి. కంభం 18.4 మి.మి, కొమరోలు 13.4.మి.మి బేస్తవారపేట 13.2 మి.మి, అర్ధవీడు 6.2 మిమి వర్షం కురిసింది. అయితే నల్లమల అటవీ ప్రాంతంలో భారీగానే వర్షం కురిసింది. దీంతో సగిలేరు, గుండ్లకమ్మ నదులకు నీరు చేరనుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటివరకు ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం లేదు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు సగిలేరువాగు పరివాహక ప్రాంతంలో పర్యటించారు. అధికారులను అప్రమత్తం చేశారు. గతంలో పలు పర్యాయాలు సగిలేరువాగు పొంగి గిద్దలూరు పట్టణంలోని చాలా ప్రాంతాలను ముంచేసింది. దీంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షం ప్రభావంతో చలిగాలులు వీస్తున్నాయి. వర్షం నీరు పట్టణంలోని శివారు ప్రాంతాల్లోని చాలా వీధుల్లో రోడ్లపైనే నిలబడింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక కొన్ని వీధుల్లో సిమెంటు రోడ్లు ఉన్నప్పటికీ నీరు నిలబడి పోగా మట్టిరోడ్లు ఉన్న ప్రాంతాల్లో వర్షం నీటితో రోడ్డంతా బురదమయమై నడిచేందుకు కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది.

వర్షాలకు కూలిన మట్టిమిద్దె

కంభం : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కంభం పట్టణంలోని కాపువీధికి చెందిన సుబ్బరాయుడుకు చెందిన పాత మట్టిమిద్దె ముందు భాగం బాగా తడిచి కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పాతమిద్దెలో స్టూడియో నిర్వహిస్తున్నారని, ఈ వర్షానికి స్టూడియో లేకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరుగలేదన్నారు.



కూలిన మట్టిమిద్దె

బీసీ కాలనీలో ప్రజల ఇక్కట్లు

బేస్తవారపేట : బేస్తవారపేట పంచాయతీలోని బీసీ కాలనీ శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం వీధిలో సిమెంట్ రోడ్డుపై మోకాలు లోతు నీళ్ల నిల్వ ఉండడంతో రోడ్డుపై రాకపోకలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఉదయం నుంచి కురిసిన వర్షానికి నీరు ఎటూ వెళ్లలేక రోడ్డుపై నిలుస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. కనీసం వర్షపు నీరు ప్రధాన డ్రైనేజిలోకి ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంట్రోలు రూమ్ ఏర్పాటు

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో వాయుగుండం నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు ఎం.హరిబాబు శనివారం తెలిపారు. అధిక వర్షాలతో మండలంలో ఎక్కడైన అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూం పోన్ నెంబరు 9398818629 సంప్రదించాలన్నారు. పాతమట్టి మిద్దెలలో నివాసం ఉండే వారు తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. పాడుబడిన నివాసగృహాల గోడలకు దూరంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. 24 గంటలు వీఆర్‌వోలు గ్రామాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ఉధృతంగా జపలేరు

కంభం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నల్లమల అడవుల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంపలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగు కంభం చెరువుకు చేరుతుందని కంభం ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్ తెలిపారు. కంభం చెరువులో ప్రస్తుతం మూడు అడుగుల మేర నీరు ఉందన్నారు. మొన్నటివరకు నల్లమల అడవుల్లో ఆశించిన మేరవర్షాలు పడకపోవడంతో కంభం చెరువుకు నీరు అందించే గుండ్లకమ్మ, జంపలేరు, నల్లవాగుల నుంచి చుక్కనీరు పారలేదన్నారు. అయితే శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జంపలేరువాగు అర్ధవీడు మండలం మీదుగా ప్రవహించి కంభం చెరువుకు చేరుతోందని డీఈ తెలిపారు. ఈ వాగుతో పాటు గుండ్లకమ్మ వాగు కూడా ప్రవహిస్తే కంభం చెరువుకు పుష్కలంగా నీరు చేరే అవకాశం ఉందన్నారు. మార్కాపురం రూరల్ : మండలంలో శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వాగులు వంకలతో పాటు గుండ్లకమ్మ కూడా జలకళను సంతరించుకుంది. మండలంలోని బొడిచర్ల గ్రామం వద్ద ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది వద్ద శనివారం సాయంత్రానికి వర్షపు నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగింది. వాతావరణ శాఖ ప్రకటించిన విధంగా భారీ వర్షాలు పడతాయని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. భారీ వర్షాలు పడితే గుండ్లకమ్మనది మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది. దీంతో మార్కాపురం పట్టణ చెరువుకు నీరు చేరుతోంది. ఇటీవల కాలంలో వర్షాలు సక్రమంగా లేక మండలంలో కొన్ని ప్రాంతాలలో పంటలు కూడా వాడి పోయినట్లు కనిపించాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు కూడా పచ్చబడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుండ్లకమ్మ నదికి వరద నీరు రావడంతో ఈ ప్రాంత రైతులు సాగుచేస్తున్న పంటలకు కొంతమేర వర్షాభావం సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలో పెద్దనాగులవరం చెరువును ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ వెంకట సునీల్, తహసీల్దార్ చిరంజీవి అధికారులతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుకు వర్షపు నీరు చేరుతోంది. దీంతో అధికారులు చెరువును పరిశీలించి నీటి వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువకట్టపై ఏమైనా మరమ్మతులు ఉంటే గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుకు ఉన్న తూముల వద్ద వర్షపు నీరు లీకులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, గ్రామ రెవెన్యూ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు ఉన్నారు.

పొదిలి : పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం అందుకు అధికారులు, నాయకులు దృష్టిపెట్టకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రహదారుల వెంబడి కుంటను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో వ్యాపార సముదాయల ముందు అడిగేవారు లేరని ఇష్టారాజ్యంగా ఎత్తుగా మట్టిపోశారు. దీంతో వర్షపు నీరు ఎటూ వెళ్లే మార్గం లేకుండా పోయింది. సుమారుగా అర కిలోమీటర్ వరకు కుంటను తలపిస్తూ నీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారులు, పాదచారులు పేర్కొంటున్నారు. మండలపరిషత్ కార్యాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, పాతపోస్టాఫీస్ ప్రాంతాల్లో వర్షపునీరు నిలవడం, 1వ సచివాలయం, పంచాయతీరాజ్ కార్యాలయాల్లోకి నీరు ప్రవహించడంతో నీరు నిలిచింది. దీంతో పింఛన్‌దారులు కూడా చాలా ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు దుకాణాల ముందు మట్టితోలుతున్నా చోద్యం చూస్తున్నారని విమర్శిస్తున్నారు. చిన్నపాటి వర్షానికి మండపరిషత్ కార్యాలయం ముందు కుంటలా నీరు నిలుస్తోంది. దీంతో రహదారుల వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాల ముందు ఎత్తుగా మట్టిపోసినా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యజమానులు రెచ్చిపోయి ఎత్తుగా మట్టితోలుతున్నారని ఆయాప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమస్యపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

కంభం : అర్ధవీడు మండలం కొత్తూరు గ్రామం వద్ద గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డు మార్జిన్లు బాగా తడిచి పోయాయి. దీంతో ఆర్టీసీ బస్సు ఎదుటి వాహనానికి సైడు ఇస్తూ రోడ్డు అంచులోకి వెళ్లింది. దీంతో మట్టిలో ఇరుక్కుపోయి ఒరిగింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సుకు బ్రేక్‌వేశాడు. ఎమర్జెన్సీ డోర్ గుండా ప్రయాణికులు కిందకు దిగారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదు.




పొదిలిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు, కొత్తూరు వద్ద రోడ్డు అంచులో ఇరుక్కున ఆర్టీసీ బస్సు

అవీ..ఇవీ..

గిద్దలూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 31 : గిద్దలూరు నగర పంచాయతీని ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనానికి శ్రీకారం చుట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న దృష్ట్యా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వర్షాకాలం కావడంతో వీధుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు వీధులను శుభ్రం చేయాలని ఆదేశించారు. పట్టణంలోని సగిలేరువాగు పరివాహక ప్రాంత ప్రజల రక్షణకు రిటైనింగ్ వాల్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. రాచర్ల రైల్వేగేటు కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సమకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ డి.వెంకటదాసు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి

పొదిలి, ఆగస్టు 31 : మండలంలో ప్రైమరీ, యూపీస్కూల్ విద్యార్థులకు ఆరవతరగతి ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి ప్రవేశానికి గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కనుక మండలంలో ఐదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థితో ఆన్‌లైన విధానంలో దరఖాస్తు చేయించాలని హెచ్‌ఎంలకు తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ సెప్టెంబరు 16తో ముగుస్తుందన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని విద్యార్థులతో ఆన్‌లైన్ చేయించాలన్నారు. దరఖాస్తులో ఏమైనా సందేహాలు ఉంటే ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

- వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల, ఆగస్టు 31: ప్రస్తుతం కురుస్తున్న ముసురువానకు పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండ ఆచూడాలని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ సూచించారు.నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు పంట పొలాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరితే పైర్లు ఉరకలెత్తి చనిపోయే ప్రమాదముందని అన్నారు. లేదా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పొలాల్లో నుండి నీటిని బయటకు పంపించి, వాన తెరిపి ఇచ్చినప్పుడు స్వరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

అన్నాక్యాంటీన్‌కు రూ.20వేల విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు, రామాంజనేయులు

గిద్దలూరుటౌన్, ఆగస్టు 31 : పట్టణానికి చెందిన అన్నపూర్ణ హోటల్ యజమానులు ఆవులమంద శ్రీనివాసులు, రాయల రామాంజనేయులు అన్నా క్యాంటీన్‌కు రూ.20వేల విరాళం చెక్కును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిల్లా రమేష్ ఉన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, ఆగస్టు 31 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో సగిలేరు, జంపలేరు నదులు ప్రవహిస్తున్నాయన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో గిద్దలూరు, రాచర్ల మండలపార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, కటికె యోగానంద్, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, జీవనేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సబ్‌జైలులో న్యాయాధికారి తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి మేరీసారదానమ్మ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 31 : పట్టణంలోని సబ్‌జైలును అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారా దానమ్మ శనివారం తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీలను వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు బెయిల్ అప్లికేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. సబ్‌జైలులో వారికి అందుతున్న సదుపాయాల గురించి సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. జైలులో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జైలు అధికారులను ఆదేశించారు. ఆర్థిక స్థోమతలేని ఖైదీలకు వారి కేసులను వాదించడానికి ఉచితంగా న్యాయవాదిని పొందవచ్చన్నారు. క్షణికావేశంలో తప్పిదాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు వార్డెన్ పి.రవీంద్రనాథ్, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ నిధులు గోల్‌మాల్‌పై విచారణ

తర్లుపాడు, ఆగస్టు 31: తర్లుపాడు పంచాయతీ నిధులు గోల్‌మాల్‌పై మార్కాపురం డీఎల్‌పీవో వై.భాగ్యవతి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. తర్లుపాడు పంచాయతీ నిధులు గోల్‌మాల్ జరిగినట్లు పలు ఫిర్యాదులు జిల్లా పంచాయతీ అధికారికి అందడంతో ఆయన ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు భాగ్యవతి తెలిపారు. తర్లుపాడు పంచాయతీ నిధులు బిల్లులు, ఎం-బుక్‌లకు తేడా ఉన్నట్లు గుర్తించారు. డంపింగ్‌యార్డు మెయింటెనెన్స్ చేయకుండానే నిధులు మార్చినట్లు గుర్తించారు. తర్లుపాడు చెత్తట్రాక్టర్‌కు డీజిల్ రూ.2.17లక్షలు మార్చడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసీడర్‌కు రిక్షా ఉన్నప్పటికీ ట్రాక్టర్ డీజిల్‌కు ఇంతా ఎలా అయిందంటూ ప్రశ్నించారు. తర్లుపాడులో పంచాయతీ నిధులు దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారించాలని, టీడీపీ నాయకులు మేకల వెంకట్, జి.సుబ్బయ్య, రత్నకుమార్, అఫ్రోజ్, వెన్నా వెంకటరెడ్డి తదితరులు లిఖిత పూర్వకంగా డీఎల్‌పీవోకు అర్జీ ఇచ్చారు. ప్రస్తుతం కొంతమేర మాత్రమే విచారణ చేసినట్లు మరలా ఒకరోజు వచ్చి తర్లుపాడు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారిస్తామని భాగ్యవతి తెలిపారు. ఈరోజు విచారణ చేపట్టిన వరకు జిల్లా అధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆమె తెలిపారు.



విచారిస్తున్న డీఎల్‌పీవో భాగ్యవతి

విచారణలో ఎంపీడీవో ఎస్.నరసింహులు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అచ్యుత్‌రావు, సర్పంచ్ పి.వరాలు ఉన్నారు.

జాతీయ రహదారిపై మినీలారీ బోల్తా

కంభం, ఆగస్టు 31 : కంభం పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం మినీలారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ నరసింహులుకు స్వల్పగాయలయ్యాయి. నర్సరావుపేట నుంచి గుంతకల్లుకు ఆవనూనె తీసుకుని వెళుతున్నాడు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఎక్కడంతో బోల్తాపడినట్లు తెలిసింది.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

- నల్లమల అటవీప్రాంతంలో గుర్తింపు

పెద్దదోర్నాల, ఆగస్టు 31: గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండల పరిధిలోని చిన్నారుట్ల గిరిజన గ్రామం సమీపంలోని నల్లమల్ల అటవీప్రాంతంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం, చిన్నారుట్ల చెంచు గిరిజనులు సమీప అటవీ ప్రాంతంలో మేకల మేతకోసం వెళ్లగా వృద్ధురాలు మృతి చెంది ఉండడం గమనించారు. దోర్నాల పోలీసుస్టేషనుకు సమాచారం ఇవ్వడంతో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు పెద్దారవీడు ఎస్సై దోర్నాల ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చిన్నారుట్ల గిరిజనులను విచారించారు. యాచకురాలు(75)గా భావిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

సురక్షితంగా ఒడ్డుకు భక్తులు



గుండ్లకమ్మకు అవతలివైపు ఉన్న భక్తులు

గిద్దలూరు, ఆగస్టు 31 : వరద నీటిలో చిక్కుకున్న రంగస్వామి గుండం భక్తులను రెస్క్యూ టీం కాపాడింది. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు చెందిన మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వరద నీటిలో చిక్కుకున్న భక్తులను కాపాడే వరకు అణుక్షణం జిల్లా, స్థానిక అధికారులతో టచ్‌లో ఉండి పర్యవేక్షించారు. రాచర్ల మండలం జేపీ.చెరువు సమీప నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి ప్రతి శనివారం భక్తులు వందల సంఖ్యలో వెళ్లి దర్శించుకుంటారు. ఈ శనివారం కూడా బాగానే భక్తులు వెళ్లారు. అయితే శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం మధ్యాహ్నానికి ఉధృతమైంది. దీంతో కొండపై నుంచి నెమలిగుండంలోకి నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. నీటిగుండం నిండి నీరు గుండ్లకమ్మ వాగులోకి ప్రవేశించింది. దాంతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి, లక్ష్మమ్మపేటకు మధ్యన ఉన్న రోడ్డులో లోలెవెల్ చప్టాపై నీరు ప్రవహించడం మొదలైంది. అరగంట లోగానే నీటి ప్రవాహం ఉధృతి పెరిగింది. ఆ సమయంలో దేవాలయం వైపు సుమారు 50 మంది భక్తులు నిలిచిపోయారు. దీంతో వారు ఎటూ వెళ్లలేక అక్కడే చిక్కుకున్నారు. దీంతో లక్ష్మమ్మపేట వైపు రోడ్డులో ఉన్న కొందరు భక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిని రక్షించే క్రమంలో ముందుగా ఖాళీ ట్రాక్టర్‌ను నది అవతలివైపు పంపారు. ఆ ట్రాక్టర్ క్షేమంగా అటు నుంచి ఇటు, ఇటు నుంచి రావడంతో భక్తులను ట్రాక్టర్ సాయంతో ఇటువైపు తెప్పించారు. ఈ క్రమంలో ప్రజలు, ట్రాక్టర్‌లోని భక్తులు గోవిందా గోవిందా అంటూ అనడంతో కొండ ప్రాంతమంతా గోవింద నామస్మరణతో మారుమోగిపోయింది. చివరకు రెస్క్యూ టీమ్ సహకారంతో భక్తులందరూ క్షేమంగా బయటపడ్డారు.

సామాజిక భద్రతే లక్ష్యం

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- దేవరాజుగట్టులో పింఛన్ల పంపిణీకి హాజరు



మంత్రితో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, ఆగస్టు 31: సామాజిక భద్రతే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో జోరువానలోనూ, ఇంటింటికీ తిరిగి సామాజిక పింఛన్లను టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. పింఛన్‌దారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి స్వామి మాట్లాడారు. పింఛన్లను రూ.200 నుంచి రూ.4000లు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కుతుదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.3వేల పింఛన్‌ను రూ.4000లకు పెంచారన్నారు. దేశచరిత్రలో ఇంత పెద్ద ఎత్తున పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు ముందే పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ముందస్తుగా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను అమలుచేస్తూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఉమ్మడి తెలుగురాష్ట్రాల ప్రాజెక్ట్ అయినప్పటికీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రాజెక్టు గేటు మరమ్మతుపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ టి.వెంకటసునీల్, డీడీవో సాయికుమార్, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీవో రాజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టంశ్రీనివాసులరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లు 3వేల నుండి 4వేలకు పెంచి ఇంటి వద్దనే లబ్దిదారునికి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. 1వ తేది ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే 31వ తేది శనివారం పట్టణంలోని 9వ వార్డులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, పెద్దభాషా, పెద్దవలి, చంద్రశేఖర్‌యాదవ్, బిల్లా జయలక్ష్మి, పార్టీ నాయకులు దమ్మాల జనార్ధన్, రఫీ, ఖాదర్‌వలి పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లెలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణయాదవ్ పింఛన్లు పంపిణీ చేశారు. కే.ఎస్.పల్లెలో టీడీపీ నాయకులు పాలుగుళ్ళ ప్రతాపరెడ్డి పింఛన్లను అందచేశారు. సంజీవరాయునిపేటలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, వెల్లుపల్లెలో ఎంపిటిసి గర్రె శ్రీనాథ్, తిమ్మాపురంలో సర్పంచ్ పసుపుల మల్లేశ్వరరావు, పొదలకొండపల్లెలో చేరెడ్డి జయరామిరెడ్డి, గోపాల్, 2వ వార్డులో కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్ పింఛన్లను అందచేశారు.

పెద్ద దోర్నాల : రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రతలో భాగంగా ముందస్తుగా మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని రామచంద్రకోటలో ఉదయం 7గంటలకు నిర్వహించిన పంపిణీలో ముఖ్య అతిథిగా గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, డీఎల్‌పీవో సాయికుమార్, టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ మంజూర్ భాష, కే సుబ్బారెడ్డి, తాతిరెడ్డి, జీ రామ భద్రారావు, జనసేన అధ్యక్షులు కేతి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : అవ్వతాతల సంక్షేమం కోసం ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రభుత్వం పంపిణీ చేయించినట్లు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. మండలంలోని సర్వాయపాలెం గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తానని చెప్పిన మాట ప్రకారం ఈనెల పింఛన్లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేయించారన్నారు. వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు, మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల నాయకులు వేగినాటి శ్రీను, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, పాలడుగు వెంకటకోటయ్యతోట మహేష్ పోక వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో ఎన్‌టీఆర్ భరోసా పంపిణీ కార్యక్రమం ఒక రోజు ముందుగానే ఆగస్టు 31న జోరువానలోనూ 95శాతం పైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్రప్రభుత్వం ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించడంతో శనివారం వర్షంలో సైతం సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

ఎర్రగొండపాలెం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం మండలంలో 8356 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను దారులు ఉండగా, శనివారం సాయంత్రంనకు 80 శాతం మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయం, పంచాయతి కార్యదర్శులు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మణికంఠరావు, ఈవోపీఆర్‌డీ రాజశేఖరరెడ్డి, సచివాలయ కార్యదర్శి సుబ్బారావు పంపిణీ చేశారు.

బేస్తవారపేట : బేస్తవారపేట మండలంలోని 19 పంచాయతీలలో లబ్దిదారులకు శనివారం ఉదయం పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెల్లవారిన వెంటనే పెన్షన్లు పంపిణీ చేయాలని ఉండటంతో ఆయా గ్రామాలకు కేటాయించిన ఉద్యోగులు జోరు వానను కూడా లెక్కచేయకుండ పెన్షన్లు పంపిణీ చేశారు.

మార్కాపురం రూరల్ : మండలంలో 90శాతం పెన్షన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి గ్రామా లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం స్థానిక టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది కలిసి పంపిణీ చేశారు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీ పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఆగస్టు 31న శనివారం రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పెన్షన్ శనివారం రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. మండలంలో గ్రామాలలో పెన్షన్ నగదును అందుకున్నారు. ఒకరోజు ముందుగానే జోరువానలో కూడా తమ ఇంటికి వచ్చి పెన్షన్ నగదు అందజేస్తున్న కూటమి నాయకులు, అధికారులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 7076 మంది పింఛన్ లబ్దిదారులు ఉండగా శనివారం ఒక్కరోజులోనే 6361 మందికి టెన్షన్ పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

తర్లుపాడు : మండలంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ దాదాపు సాయంత్రానికి మండలంలో 92 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నరసింహులు తెలిపారు. ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయటంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉడుముల చిన్నపురెడ్డి, పి.గోపినాథ్ చౌదరి, గుర్రపుసాల నరసింహులు, కె.కాశయ్య, వె.జాను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
» ప్రజాసంక్షేమం టీడీపీకే సాధ్యం
» జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

కనిగిరి ఆగస్టు 31: ప్రజాసంక్షేమం టీడీపీకే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. జోరు వర్షంలోనూ ఆయన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేశారు. శనివారం కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ, కనిగిరి మండలం గానుగపెంట, గురవాజీపేట, పీసీపల్లి మండలం నేరేడుపల్లి, హనుమంతునిపాడు మండలంలోని మిట్టపాలెం గ్రామాల్లో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి ఎంతోమంది వృద్ధులు జీవిస్తున్నారని చెప్పారు. వారు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతోనే వర్షం పడుతున్నా పంపిణీ ఆపలేదన్నారు. ఈసందర్భంగా అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు.. అధికారులు, టీడీపీ శ్రేణులు కూడా పింఛన్‌ల కార్యక్రమం బాధ్యతగా నిర్వర్తించినందుకే కనిగిరి మండలంలో సాయంత్రం 5గంటలకు 93.2 శాతానికిపైగా పంపిణీ చేయటం సాధ్యమైందన్నారు. సీఎం చంద్రబాబు పాలనా దక్షతకు ఇదే నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు..

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫూర్, ఎస్ఐ త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నంబులు వెంకటేశ్వర్లు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, తెలుగుమహిళలు కరణం అరుణ, తులసి, నారాయణమ్మ తదితరులు వారివారి గ్రామాల్లో, ప్రాంతాల్లో పింఛన్‌లను పంపిణీ చేశారు.

ఒకరోజు ముందుగానే పింఛన్‌ల పంపిణీ

దర్శి ఆగస్టు 31: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతినెలా క్రమంతప్పకుండా పింఛన్లు అందిస్తుండటంతో అవ్వ తాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. శనివారం దర్శి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి పలు ప్రాంతాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. వర్షాన్ని లెక్కచేయకుండా ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం రావటంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం శనివారమే పింఛన్లు పంపిణీ చేయటంతో పింఛన్‌దారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక రోజులు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.4 వేలకు పెంచిన పింఛన్ క్రమంతప్పకుండా ఇస్తుండటంతో లబ్ధిదారుల్లో ఎంతో సంతృప్తి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

వర్షంతో ఇబ్బంది పడుతున్న వలస కూలీలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భోజనం ప్యాకెట్లు సరఫరా చేశారు. దర్శి పట్టణంలోని శివరాజ్‌నగర్‌లో అనేకమంది కూలీలు పనుల కోసం వచ్చి వర్షంతో ఎక్కడికివెళ్లలేక రోడ్లపక్కన తలదాచుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఆమె భోజనం ప్యాకెట్లు తెప్పించి అందరికీ అందజేశారు.



వలస కూలీలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

వర్షంలోనూ లబ్ధిదారులకు అందజేత

తాళ్లూరు, ఆగస్టు 31: వర్షంలోనూ పెన్షన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేశారు. మాధవరం గ్రామంలో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటో తేదీ సెలవు కావటంతో సీఎం చంద్రబాబు ముందురోజే పెన్షన్లు పంపిణీకి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా వర్షాన్ని లెక్క చేయక లబ్ధిదారుల సంక్షేమం కోసం ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందజేయటం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



తాళ్లూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

పీసీపల్లిలో 92శాతం పంపిణీ

పీసీపల్లి, ఆగస్టు 31: సెప్టెంబరు 1న పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్లను ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది శనివారమే లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం రాత్రి నుంచి వర్షం పడుతున్నా సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం ఆరుగంటలకల్లా వారికి కేటాయించిన గ్రామాలకు చేరుకొని అందజేశారు. మండలంలో 4785 మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రం ఐదు గంటలకు 4402 మందికి అందజేశారు. 92శాతం పంపిణీ చేశామని, మిగిలినవారికి సోమవారం అందజేయనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.



కనిగిరి: హనుమంతాపురం గ్రామంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పామూరులో.. పామూరు, ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ శ్రేణులతో కలిసి శనివారం సచివాలయ సిబ్బంది అందజేశారు. వర్షంలోనూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యరవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన నాయకులు వై.రహీముల్లా, ఏడుకొండలు వి.బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలంలో జరిగిన ఫింఛన్ల పంపిణీలోనూ టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. కోవిలంపాడులో జరిగిన కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా, పాలపర్తి నారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో 90 శాతం పంపిణీ

ముండ్లమూరు, ఆగస్టు 31: మండలంలోని అన్నిగ్రామాల్లో శనివారం పింఛన్లు పంపిణీచేశారు. మండలంలో 7,160 మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రానికి 90 శాతం పంపిణీ చేశారు. పసుపుగల్లులో ఎంపీడీవో ఆర్.జనార్దన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెదఉల్లగల్లులో మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, ముండ్లమూరులో మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, మారెళ్ళలో ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, శంకరాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణ స్వామి పింఛన్‌లు పంపిణీ చేశారు.



ఆక్రమణకు గురైన దేవదాయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఆలయ భూములను దేవుడి పేరుపై ఆన్‌లైన్ చేయాలి

పామూరు, ఆగస్టు 31: ఆలయాల భూములను తక్షణమే దేవుడి పేరుపై ఆన్‌లైన్ చేసి నమోదు చేయాలని పామూరు, వరికుంటపాడు తహసీల్దార్‌లు రమణరావు, సయ్యద్ హుసేన్‌లకు దేవదాయ శాఖ డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు బొంతు మహేశ్వరరెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జాయింట్ కమిషనర్(ల్యాండ్) చంద్రశేఖర్‌ఆజాద్ ఆదేశాల మేరకు ఆక్రమణలకు గురైన మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వర స్వామి ఆలయ భూములను శనివారం పరిశీలించారు. ఆలయ భూములు, దేవస్థాన షాపుల ఆక్రమణలపై ఆరా తీశారు. వెంటనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఈవో నరసింహబాబుకు సూచించారు. షాపుల అద్దెకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించాలన్నారు. జాతీయ రహదారి, రైల్వే లైన్ భూసేకరణలో దేవస్థానం భూములకు సంబంధించి రూ.రెండు కోట్ల నష్టపరిహారం సొమ్మును దేవాలయ ఖాతాలో జమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కనిగిరి, ఆగస్టు 31: కనిరిగిలోని పొగాకు వేలం కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా పొగాకు రైతులకు అందుతున్న ధరలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. వేలం కేంద్రంలో ఉన్న పొగాకును ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాయం తిరుపతిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

కనిగిరి ఆగస్టు 31: నారుమడుల్లో ఉన్న ఉద్యానపంటలైన మిరప, ఇతర కూరగాయల పంటలపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కనిగిరి ఉద్యానశాఖ అధికారి ఎం.అంజలీభాయి పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నారుకు కుళ్ళుతెగులుసోకే అవకాశం ఉందన్నారు. నారుమడుల్లో వర్షపు నీరు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నారుమడులలో నీరు నిల్వటం వలన వేర్లకు గాలి సోకుండా కుళ్ళిపోయే అవకాశం ఉందన్నారు.

సీఐ నాయక్‌కు సన్మానం

పామూరు, ఆగస్టు 31: పామూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎం.భీమానాయక్‌ను శనివారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరించారు. దళితుల భూసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రాష్ట ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటగాని పేతూరు కోరారు. సీఐని కలిసిన వారిలో బిద్దిపూడి మార్క్, సేక్ నాయబ్‌రసూల్ తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత జాలా అంజయ్య

పామూరు, ఆగస్టు 31: ప్రజాసమస్యలపై పోరాడాలని సీసీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వర్తమాన రాజకీయాలపై ప్రసంగించారు. సంక్షోభాలకు పరిష్కారం సోషలిజమేనని అన్నారు. చైనా తదితర దేశాలు అభివృద్ధి వైపు దూసుకెళుతున్నాయని చెప్పారు. మనదేశంలోని కమ్యూనిస్టు శ్రేణులు ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలపై భారాలు మోపుతూ, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తున్నాయని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధుల బారినపడి ప్రజలు విలవిల లాడుతున్నారని అన్నారు. సీపీఎం బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, మండల కార్యదర్శులు కె.మాల్యాద్రి, యు.వెంకటేశ్వర్లు, రాజ్యాలక్ష్మి, భానుమతి, మదారమ్మ, కె.శంకర్, అల్లబక్ష్, సీహెచ్ వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, షేక్ మహబూబ్‌పీరా, పందిటి రామయ్య పాల్గొన్నారు.

రామరాజు సేవలు అభినందనీయం



డీఎస్పీ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 31: పోలీసుశాఖలో డీఎస్పీ రత్నాకరం రామరాజు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో రామరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1991లో ఎస్ఐగా ఉద్యోగంలో చేరిన రామరాజు అంచెలంచెలుగా వివిధ హోదాలు దక్కించుకున్నారన్నారు. పోలీసు శాఖలోనే కాకుండా ప్రజల్లోనూ రామరాజు మన్ననలు పొందారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎస్పీ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కనిగిరి జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర, ఆర్డీఓ జాన్‌ఇర్విన్, అద్దంకి, కొండపి, పామూరు, కనిగిరి సీఐలు శివరామకృష్ణారెడ్డి, సోమశేఖర్, భీమానాయక్, ఖాజావలి, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐలు త్యాగరాజు, శివనాగరాజు, ప్రేమ్‌కుమార్, రమేష్, పోలీస్ కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం.. పైర్లకు జీవం

దర్శి, ఆగస్టు 31: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేస్తున్న పైర్లు ఈ వర్షాలకు జీవం పోసుకున్నాయి. గత కొద్దిరోజులుగా తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన కంది, సజ్జ, పత్తి తదితర పైర్లు బెట్టకు వచ్చిన విషయం తెలిసిందే. సజ్జ పైరు కంకి తీస్తున్న దశలో ఉంది. వర్షం లేకపోతే పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆందోళనలు చెందుతున్న తరుణంలో విస్తారంగా వర్షం కురవటంతో అన్నీపైర్లు జీవం పోసుకున్నాయి. దీంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. దర్శి ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు గృహాలకే పరిమితమయ్యారు.



దర్శి: వర్షానికి కళకళలాడుతున్న సజ్జ పైరు

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 31: దర్శి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం పరిశీలించారు. గతంలో వర్షాలకు పొంగుతూ ప్రవహించే కాటేరు వాగును ఆమె పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడ జరుగుతున్న ఇబ్బందిని గుర్తించి పూడిపోయిన కాటేరువాగులో మట్టిని తీయటంతో ఎలాంటి ఇబ్బందిలేకుండా నీటి ప్రవాహం కిందకు వెళ్తుందని తెలిపారు. అలాగే, దర్శి పట్టణంలో మురుగు కాల్వలలో పూడికి తీయించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచినట్టు చెప్పారు. దీంతో రోడ్లపై ఎక్కడా నీరు నిలబడలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వర్షం పడినప్పుడల్లా మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడేవారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పాలనలో మార్పును గుర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపైకి చేరిన నీరు



దొనకొండ: గుండ్లకమ్మ చప్టాను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

తాళ్లూరు, ఆగస్టు 31: మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు జీవం పోసుకున్నాయి. పలు గ్రామాల్లో మురుగు కాల్వలు పూడుకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఓమోస్తరు వర్షం కురవగా, శనివారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వర్షాభావంతో మొక్కజొన్న, కంది, వరి, మిరప ఎండుముఖంపట్టాయి. ఈతరుణంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జీవం పోసుకున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మురుగు కాలువలో పూడికతీత పనులు చేయకపోవటంతో కాలువలు నిండుకుని వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్ల వెంట ప్రవహించింది. దీంతో తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, తాళ్లూరు తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా తహసీల్దార్ పి.శింగయ్య వీఆర్వోలను అప్రమత్తం చేశారు.

ఎడతెరిపిలేకుండా వర్షం

దొనకొండ, ఆగస్టు 31: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమిత మయ్యారు. పలుగ్రామాల్లో లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ చప్టాను తహసీల్దార్ రమాదేవి పరిశీలించారు. ఎడతెరపి లేకుండా వర్షం కురిసే సమయంలో ఈచప్టాపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. చప్టాపై వర్షంనీరు ప్రవహిస్తే ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రజలను, వాహనచోదకులను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు.

చిలకలేరు వాగును పరిశీలించిన తహసీల్దార్, ఎస్ఐ



ముండ్లమూరు - వేంపాడు మధ్య చిలకలేరు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ నాగరాజు

ముండ్లమూరు, ఆగస్టు 31: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి వాగులు పొంగి ప్రవహించే అవకాశాలు ఉండటంతో శనివారం సాయంత్రం తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎస్ఐ వై.నాగరాజు పరిశీలించారు. ప్రధానంగా ముండ్లమూరు- వేంపాడు మధ్య చిలకలేరు వాగు, మారెళ్ళ- జమ్మలమడక మధ్య ఉన్న ఈదర వాగు, వేముల వాగు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. దీంతో వీఆర్వో, వీఆర్ఏ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచినట్టు చెప్పారు. రాత్రుళ్లు వాహన చోదకులు వాగులు దాట వద్దన్నారు. ఏదైనా ప్రమాదం పొంచి ఉన్నట్లయితే 9121102164కు ఫోన్ చేయాలన్నారు.

పైర్లకు జీవం పోసిన వర్షం



వెలిగండ్ల మండలం గోకులం గ్రామంలో పైర్లను పరిశీలిస్తున్న ఏడీఏ ఈవీ రమణ

కనిగిరి ఆగస్టు 31: మెట్ట పైర్లకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు జీవం పోశాయని కనిగిరి వ్యవసాయశాఖ ఏడీఏ ఈవీ రమణ తెలిపారు. నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం గోకులం గ్రామంలోని కంది, సజ్జ పైర్లను శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 30మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు.

కనిగిరి నియోజకవర్గంలో 8వేల ఎకరాల్లో కంది, మూడువేల ఎకరాల్లో సజ్జ, ఐదు వందల ఎకరాల్లో వరి, వంద ఎకరాల్లో పొగనారు వేశారని తెలిపారు. ఎండుముఖం పట్టిన పైర్లకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని ఏడీఏ రమణ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

దొనకొండలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

దొనకొండ, ఆగస్టు 31: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అత్యవసర సహాయం, సమాచారం నిమిత్తం దొనకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. పాతమిద్దెలు, పాడుబడిన కట్టడాలు కింద నివసించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు.

మనటీడీపీ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు, ఆగస్టు 31: మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ సమాచారాన్ని విస్తృతస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ప్రతిభ చూపడం అభినందనీయమని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టి కూటమి అద్భుత విజయం సాధించే వరకు అనేక రకాలుగా పార్టీకి, నాకు అండగా నిలిచిన ఐటీడీపీ శ్రేణుల రుణాన్ని తీర్చుకోలేనని కొనియాడారు ఈసందర్భంగా ఎన్టీఆర్ భవన్ నుంచి మంత్రి నారా లోకేష్ పామూరు శ్రేణులకు పంపించిన ప్రశంసాపత్రాలను శనివారం కనిగిరిలోని అమరావతి కార్యాలయంలో డాక్టర్ ఉగ్ర అంద జేశారు.



ఎమ్మెల్యే ఉగ్ర చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకొంటున్న పామూరు ఐటీడీపీ శ్రేణులు

ఉగ్ర చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకొన్న వారిలో పోకా నాయుడుబాబు, షేక్ ఖాజారహంతుల్లా, పువ్వాడి వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య కమ్మబాల కృష్ణ, పత్తు మస్తాన్, గడ్డె వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

కరణంకు ప్రశంసాపత్రం

పీసీపల్లి, ఆగస్టు 31: మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ సమాచారం చేరవేయడంలో ప్రతిభచూపిన మండలంలోని వెంగళాయపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త కరణం వెంకటేశ్వర్లు ప్రశంశా పత్రాన్ని అందుకున్నారు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రతి పక్షాలపై పెట్టిన అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీడీపీ తెచ్చిన యాప్ ద్వారా వెంకటేశ్వర్లు విస్తృత ప్ర చారం చేశారు. వెంకటేశ్వర్లును అభినందిస్తూ చంద్రబాబునాయుడు సంతకంతో కూడిన ప్రశంశాపత్రం కనిగిరిలోని పార్టీ కార్యాలయానికి పంపించారు.

శనివారం అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




బాపట్ల జిల్లా వార్తలు

3

ఆదివారం 1 సెప్టెంబరు 2024

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వణికిపోయింది. ఊరూ వాడా ఏకం కాగా అడుగు బయట పెట్టటానికి జిల్లా వాసులు భయపడి పోయారు. పల్లెటూర్లలోని వాగులు వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పట్టణాల్లోని మురుగు కాల్వలు రోడ్డెక్కటం తో నగరాలు నయాగరా జలపాతంలా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు మీదకు వచ్చిన వాహన చోదకులకు ఏది దారో..ఏది మాయదారో అర్థం కాక చాలా ప్రమాదాలు జరిగాయి. ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న పంట పొలాలు వరుణిని ఏక ధాటికి పూర్తిగా నీట మునిగాయి. 2019- 2024 వరకు చెరువులు, కాల్వలు పటిష్ఠ పరచకపోవటంతో గండ్లు పడతాయమో అనే అనుమానాలు కలుగుతున్నాయి. కృష్ణమ్మ ఉగ్రరూపిణి కావడం తో ఏటిపట్టు గ్రామాల్లో కి నీరు తన్నుకొస్తుంది. ఇష్టానుసారంగా తవ్వేసిన ఇసుక తిన్నెలు వల్ల వరద అంచనా వేయడం కష్టం గా ఉండటం తో అచ్చంపేట, అమరావతి మండలాల్లో వరద నీరు ఊర్ల లోకి భారీ స్థాయిలో వచ్చి చేరుతుంది. వానకు గాలి కూడా తోడవ్వటం తో చాలా పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇల్లు వాకిలి లేని నిరాశ్రయుల పరిస్థితి దయనీయంగా మారింది. వానకు తడుస్తూ, చలిలో వణుకుతూ అల్లాడిపోతున్నారు.అత్యవసర విభాగాలకు చెందిన ఉద్యోగులు కూడా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగించారు. పోలీసులు అహర్నిశలు శ్రమించి ప్రజల ను ముంపు ప్రాంతాల్లో కి వెళ్లకుండా నివారించడం తో ప్రాణ ప్రమాదాలు తప్పాయి.ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించడం తో ముప్పు తప్పింది. మూడు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు సహాయక చర్యలు కోసం కార్యకర్తలను అప్రమత్తం చేశారు. భోజనాలకు ఇబ్బంది పడుతున్న వారికి ఆహారపు ప్యాకెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు,ఇతర ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ఆరంభించారు.




బాపట్ల: జమ్ములపాలెం-కంకటపాలెం వద్ద నీట మునిగిన వరి పైర్లు

ముంచెత్తిన వాన

రేపల్లె: నిజాంపట్నం మండలం కూచినపూడిలో జలమయమైన వరిపొలాలు



రేపల్లె బస్టాండ్ రోడ్డులో భారీ వర్షంతో జలమయమైన రహదారి



కొల్లూరు: దొండ తోటలో భారీగా చేరిన వర్షపు నీరు

- జిల్లాలో వేల ఎకరాల్లో నీటమునిగిన పైర్లు
- లోతట్లు ప్రాంతాలు, రహదారులు జలమయం
- ఎడతెరిపిలేని వర్షంతో ప్రజల అవస్థలు
- వర్షప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్‌తో పాటు ప్రత్యేక అధికారి పర్యటన
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఒకటే వర్షం...ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి జిల్లా వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. అల్పపీడనం ప్రభావంతో గురువారంరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు శనివారం నాటికి జిల్లాను ముంచెత్తాయి. వేల ఎకరాల్లో పైరు నీటమునగడంతో పాటు వాగులువంకలు పొంగిపొర్లుతుండడంతో రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

రహదారులు తటాకాలను తలపించే విధంగా వర్షపు నీటితో నిండిపోయాయి. శనివారం ఉదయం నుంచే వర్షప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ వెంకటమురళి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ శేషగిరి బాబు రేపల్లె ప్రాంతంలో పర్యటించి భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఆరా తీశారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 8712655881 నంబరుతో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడంతో పాటు బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవో కార్యాలయాల్లోనూ ప్రజల సహాయార్థం కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. బాపట్ల పరిధిలోని శారదాకాలనీలోని లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకటమురళి పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు

నీటమునిగిన పొలాలు....

నిన్నమొన్నటి వరకు చినుకు రాకకోసం ఎదురు చూసిన రైతన్నలకు ఈ కుండపోత వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి వేల ఎకరాల్లో పైరు నీట మునగగా ఇందులో ఎక్కువ శాతం వరిదే ఉంది. బాపట్ల, రేపల్లె, నగరం, చెరుకుపల్లి, కొల్లూరు, చెరుకుపల్లి మండలాల్లోని పొలాలు భారీ వర్షాల ధాటికి ఎక్కువగా ప్రభావితమయ్యాయి

పొంగిన కాలువలు...

భారీ వర్షాల ధాటికి సూర్యలంక రోడ్డులో ఉన్న ఉధృతంగా ప్రవహిస్తోంది. అదే విధంగా పర్చూరు పరిధిలో ఉన్న కేసవరప్పాడు, తమిడిపాడు మధ్య ఉన్న అలుగు వాగు ప్రవాహంతో పోటెత్తింది. అద్దంకి పరిధిలోని తిమ్మనపాలెం చెరువు అలుగు పారడానికి వీల్లేకపోవడంతో కట్టతెగే ప్రమాదం పొంచి ఉండడంతో రెవెన్యూ యంత్రాంగంతో పాటు హైవే అధికారులు అప్రమత్తమయ్యారు. ఇవే కాకుండా జిల్లాలో పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతుండంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. దీనికి తోడు గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కాలువలు అధ్వానంగా ఉండడంతో భారీగా కురుస్తున్న వర్షాల వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లి ఆ నీరు పంటపొలాల్లోకి రావడంతో నష్ట తీవ్రత పెరిగే అవకాశాలు కనబడుతున్నాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కర్లపాలెం మండలంలోని పశువైద్యశాల జలదిగ్బంధనంలో చిక్కుకోగా, బాపట్ల మండల పరిధిలోని జమ్ములపాలెం రోడ్డులో ఈదురుగాలులకు భారీ వృక్షం ఒకటి నేలకూలగా రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది

పంటలను ముంచెత్తుతున్న వరద

లంక గ్రామాల్లోని వాణిజ్య పంటల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. మరో వైపు కృష్ణానదికి వరద నీరు పోటెత్తడంతో లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్ని వరద నీటిలో చిక్కుకున్నాయి. చింతల్లంక వద్ద పాయలో నుంచి వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతూ సుగ్గునలంక వైపు ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చినరేవులో నుంచి వరద నీరు దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంకకు వెళ్లే చప్టాపై ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి.



బాపట్లలో నీటమునిగిన కాలనీలను పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మున్సిపల్ కమిషనర్ ఐ.నిర్మల్‌కుమార్ తదితరులు



బాపట్ల: శారదాపురికాలనీలో నీటమునిగిన రోడ్లను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



కొల్లూరు: అరవింద వారధి వద్ద వరద ఉధృతి



కొల్లూరు: గాజుల్లంక వద్ద ఇటుక బట్టీల్లో చేరిన వరద నీరు



కొల్లూరు: కోతకు గురవుతున్న గండి వద్ద పోసిన కట్ట



కొల్లూరు: లంక గ్రామాల్లో పసుపు పొలంలో నిలిచిన వర్షపు నీరు



బ్యారేజ్ దిగువున మొదటి ప్రమాద హెచ్చరిక

కృష్ణానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి 3లక్షల 42వేల 466 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 70 గేట్లను తెరిచి నీటిని వదులు తున్నారు. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులి చింతల గేట్లు తెరుచుకొన్న దృష్ట్యా ఏ క్షణాన అయినా బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో 4 లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉండటంతో శనివారం అర్ధరాత్రికి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

సగటు వర్షపాతం 83.5 మిల్లీమీటర్లుగా నమోదు

శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో కురిసిన కుండపోత వర్షాలకు 83.5 మి.మీ. సగటు నమోదు అయింది. అత్యధికంగా చుండూరులో 167, అమర్తలూరులో 133.8, నగరం 134.2, సంతమాగులూరులో 113.4, చెరుకుపల్లి 100.6, కొల్లూరు 103, రేపల్లె 81.8, బాపట్లలో 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం మధ్యాహ్నం వరకు జిల్లాలో సగటు 69 మిల్లీమీటర్లు నమోదు కాగా ఆ తర్వాత కురిసిన కుంభవృష్టికి సగటు 83.5 మి.మీకు ఎగబాకింది

4,200 ఎకరాల వరకు నీట మునిగినట్లు...

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల ధాటికి జిల్లా వ్యాప్తంగా 4,200 ఎకరాల్లో పైరు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. కుండపోత వర్షాల వల్ల జిల్లాలోని 45 గ్రామాల పరిధిలోని 2,070మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు నివేదికలో పొందుపర్చారు. వెద, నాటు పద్ధతిన ఇప్పటివరకు జిల్లాలో 62,230 హెక్టార్లలో వరిసాగు జరిగిందని ప్రస్తుతానికి వీటికి వచ్చిన ముప్పేమి లేదని అధికారులు తెలిపారు.

వాగులో కొట్టుకు పోయిన కారు

ఇద్దరు చిన్నారుల సహా ఉపాధ్యాయుడి మృతి



పెదకాకాని, ఆగస్టు 31 : గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒక ఉపాధ్యాయు డు, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన నడింపల్లి రాఘవేంద్రరావు(40) అనే వ్యక్తి నంబూరు సమీపంలోని వివా స్కూల్లో మ్యాథమెటిక్స్ టీచర్‌గా పని చేస్తుంటారు. ఇటీవల ఆయన ఉప్పలపాడులో నివాసం ఉంటున్నాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా స్కూలుకి వెళ్లారు. అయితే భారీ వర్షం పడటంతో పాఠశాలకు సెలవిచ్చారు. ఈ క్రమంలో ఉప్పలపాడుకు చెందిన 4 వ తరగతి చదువుతున్న కోడూరి మాన్విక్ (9), 2వ తరగతి చదువుతున్న పసుపులేటి సౌరిస్(8) తన కారులో ఎక్కించుకొని స్కూల్ నుంచి బయలుదేరాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉప్పలపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీన్ని గమనించకుండా రాఘవేంద్ర కార్‌ను వేగంగా నడిపాడు. వరద ఉధృతికి కారు వాగులో కొట్టుకుపోయింది. అందులో ఉన్న ముగ్గురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరామర్శించారు.

కొండ రాయి పడి వృద్ధురాలి మృతి



మంగళగిరి కొత్తపేట ఒకటో వార్డు పరిధిలో కొండచరియ విరిగిపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రూకా నాగరత్నమ్మ (65) వంట గదిలో అన్నం వండుతున్న సమయంలో కొండ పైనుంచి భారీ బండరాయి దొర్లిపడడంతో నాగరత్నమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు నరేంద్ర (బాబీ), అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి టీడీపీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మరో రెండు రోజులు వర్షాలు పడే సూచనలు వుండడంతో కొండ దిగువన వున్న ఇళ్లను అధికారులు ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు. రెండవ వార్డులో ఆటోడ్రైవరుగా పనిచేస్తున్న కూనిశెట్టి దుర్గారావు నివాసం గోడ భారీ వర్షానికి కుప్పకూలింది.



చుండూరు: చినపరిమి వద్ద నీట మునిగిన పంట భూములు

నిజాంపట్నం హార్బర్‌లో మూడవ నెంబరు ప్రమాద సూచిక

రేపల్లె, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచిక ఎగురవేసినట్టు ఇన్‌చార్జి పోర్టు కన్జర్వేటర్ మోకా రామారావు శనివారం తెలిపారు. దీని ప్రభావం వల్ల సముద్రంలో బోట్లు వేటకు వెళ్లరాదని, ఒకవేళ ఎవరైనా వేటకు వెళితే తీరానికి చేరాలని ఆయన తెలిపారు.

వర్షంలోనూ ఆగని పెన్షన్ పంపిణీ

- ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు కానుక అందించిన ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో 80 శాతానికి పైగా లబ్ధిదారులకు అందిన నగదు
- పునరావాస చర్యలు తీసుకుంటూనే పింఛన్ల అందజేత

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెల ఒకటో తేదీన అందాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందింది. గురువారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా, శనివారం భారీ వర్షంగా మారి వరదలు ముంచెత్తుతున్నా వెనక్కి తగ్గేదే లేదన్నట్లు ప్రభుత్వం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సాగించింది. లక్షలాది మంది వలంటీర్లు ఉంటే తప్ప మా వల్ల కాదంటూ చేతులెత్తేసిన గత ప్రభుత్వానికి చెంపపెట్టులా సచివాలయ ఉద్యోగులే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో కూటమి ప్రభుత్వ పని విధానంపై సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం వర్షాలు, వరద భీభత్సం తీవ్రంగా వుంది. అయినప్పటికీ పింఛన్ల బట్వాడా ఆగలేదు. వర్షాలు, వరద ముంపు భారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపడుతూనే పెన్షన్ల బట్వాడా సాగించారు. గుంటూరు జిల్లాలో 80.39 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. జిల్లాలో 2,56,890 మందికి గానూ 2,06,521 మందికి పెనన్లు అందాయి. పల్నాడు జిల్లాలో 85.4 శాతం మందికి అందాయి. జిల్లాలో 2,77,282 మంది పింఛనుదారులు ఉండగా 2,36,867 మందికి పెనన్లు అందాయి. ఈ ప్రాంతాల్లో వరద ప్రభావం ఎక్కువగా వుండడంతో లబ్ధిదారులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. వారికి ఆది, సోమవారాల్లో పింఛన్లు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా బాపట్ల జిల్లాలో అత్యధికంగా 89.93 శాతం పింఛన్లు అందాయి. జిల్లాలో 2,31,200 మంది లబ్ధిదారులు వుండగా, 2,07,914 మందికి పింఛన్లు అందాయి. జోరువానలో ఉదయం 6 గంటలకే బాపట్ల పట్టణపరిధిలోని భీమావారిపాలెంలోని లబ్ధిదారులకు పింఛన్‌ను కలెక్టర్ వెంకటమురళి అందించారు. అదే విధంగా కూటమి నాయకులు ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ తదితరులు



చీరాల: చల్లారెడ్డిపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య తదితరులు



బాపట్లలోని భీమావారిపాలెంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి తదితరులు



పెన్షన్ పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా పరిస్థితిపై కలెక్టర్‌తో మాట్లాడిన మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 31: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. అమరావతిలోని సచివాలయం నుంచి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రావద్దని సూచించారు. విద్యుత్‌తీగలు తెగిపడినా, కిందకు జారినా వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చిన వెంటనే అధికారులు స్పందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సీఎంతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లాలో పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. సీఎం సూచనలతో బాపట్ల కలెక్టర్‌ను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న వారికి రెండు, మూడు రోజులలో పంపిణీకి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె,ఆగస్టు 31 : తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా అధికారులు సమన్వయం తో విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం అధికారులతో తుఫాన్ ప్రభావంతో తీరంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని, వేటకు వెళ్ళినవారిని వెనక్కి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అకాల వర్షంతో పూరిగుడిసెలు, పాత డాబాలు, విద్యుత్‌స్థంభాలు, వైర్లు తెగిపడే ప్రమాదం ఉందని, ముందస్తుగానే వాటిని గుర్తించి ఆయా ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కృష్ణానదికి వరద పోటెత్తటంతో దిగువ భాగానికి రెండులక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని, కృష్ణాకరకట్ట వెంట గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, జిల్లా స్పెషలాఫీసర్ శేషగిరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

హైడ్రామా

మున్సిపల్ సమావేశానికి రాని వైసీపీ కౌన్సిలర్‌లు

కోరం లేక వాయిదా ప్రకటించిన చైర్‌పర్సన్

వైసీపీ కౌన్సిలర్లను పిలిపించిన టీడీపీ నేతలు

అనంతరం సాగిన వైనం

అద్దంకి, ఆగస్టు 31 : అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం హైడ్రామా మధ్య సాగింది. ఎలాగైనా సమావేశం జరగకుండా చేయాలనుకున్న వైసీపీ కౌన్సిలర్‌ల పన్నాగం బెడిసికొట్టింది. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం ప్రారంభమైంది. అయితే అప్పటికి వైసీపీ కౌన్సిలర్‌లెవరూ హాజరు కాలేదు. టీడీపీకి చెందిన 6గురు కౌన్సిలర్‌లతో పాటు ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్‌లు హాజరయ్యారు. దీంతో కోరం లేనందున సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ తన చాంబర్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు, కౌన్సిలర్‌లు ఎలాగైనా సమావేశం నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చారు. దీంతో టీడీపీ నేతలతో టచ్‌లో ఉన్న ముగ్గురు వైసీపీ కౌన్సిలర్‌లు సమావేశానికి వచ్చేలా చేశారు. దీంతో 11 మంది సభ్యులు హాజరుకావడంతో వైస్ చైర్మన్ ద్వారా సమావేశం నిర్వహించాలని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు కమిషనర్ సత్యనారాయణను కోరారు. విషయం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ వరకు చేరడంతో కొద్దిసేపటి తరువాత వచ్చి సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశం వాయిదా వేసిన తీరుపై పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మను ప్రశ్నించారు. గతంలో పలు సందర్భాలలో సమావేశం ఆలస్యంగా ప్రారంభించడాన్ని గుర్తు చేశారు. అనంతరం మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరయ్యారు. అజెండాలోని 11వ అంశంగా ఉన్న అప్కాస్ ద్వారా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో ఏడుగురుని ప్రత్యేకంగా గుర్తించాలన్న అంశం మినహా మిగిలిన అంశాలన్నీ సమావేశంలో ఆమోదించారు.

రాజీమార్గంతో అందరికీ ఆనందం

- న్యాయాధికారి సుధ



మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, ఆగస్టు 31 : రాజీమార్గంతో ముందుకు వెళితే రెండు వర్గాలు ఆనందంతో ఉంటారని న్యాయాధికారి సుధ పేర్కొన్నారు. ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ జరుగనున్న నేపథ్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి శనివారం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాలు అందరికీ న్యాయం అందాలన్న ఉద్దేశంతోనే మండల న్యాయ సేవాధికార సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో నిస్సహాయులు ఉచితంగా తమ హక్కును సాధించవచ్చని తెలిపారు. ఈక్రమంలోనే ఎటువంటి వ్యయప్రయాసకు పోకుండా రాజీపడదగిన వారు లోక్ అదాలత్‌లో న్యాయం పొందవచ్చని న్యాయాధికారి వివరించారు



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి

గుడ్లవల్లేరు ఘటన వెనుక వైసీపీ కుట్ర

- మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి
- చీమకుర్తి ఎస్సీబాయ్స్ హాస్టల్ ఆకస్మిక తనిఖీ
- సిబ్బంది గైర్హాజరుపై సీరియస్
- సిబ్బందిపై ఆగ్రహం

చీమకుర్తి, ఆగస్టు 31: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సంఘటన వెనుక వైసీపీ కుట్ర ఉందని తాము అనుమానిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ని మంత్రి శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో పిల్లలకు గదులు, స్టోర్ రూం, వంట గదులను పరిశీలించారు. హాస్టల్ సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోవాలని డీడీ లక్ష్మానాయక్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. వర్షంలో తడుస్తూనే మరుగుదొడ్లు, పరిసరాలను మంత్రి పరిశీలించారు. అవి అధ్వానస్థితిలో ఉండటం, ట్యాప్‌లు పనిచేయకపోవటంపై సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు పేర్కొన్నారు. జగన్ అధికారం కోల్పోయాక ప్రజలపై లేనిపోని ప్రేమను ఒలకబోస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు చేయటం, ప్రభుత్వంపై బురదచల్లటం వైసీపీకి దినచర్యగా మారిందన్నారు. గత ప్రభుత్వం వైఫల్యం, నిర్లక్ష్యవైఖరి వలనే రాష్ట్రంలో హాస్టల్స్‌కు ఈ దుస్థితి పట్టిందన్నారు. హాస్టల్స్‌లో భద్రత, పరిశుభ్రత, వసతుల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

కొన్నిప్రాంతాల్లో భారీగా

నీటి వనరుల్లోకి చేరుతున్న వర్షపు నీరు

పశ్చిమాన పొంగుతున్న వాగులు

తాజా పరిస్థితిపై మంత్రి, కలెక్టర్లతో సీఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్

అప్రమత్తంగా ఉండాలని సూచన

కొత్తపట్నం తీరంలో పర్యటించిన కలెక్టర్

ముసురేసింది

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ముసురుపట్టినట్లు జల్లులు పడ్డాయి. తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్ పంటలు ముందుకు సాగక ఆందోళన చెందుతున్న జిల్లా రైతాంగానికి ఊరట లభించింది. ఇప్పటివరకు సాగైన పంటల రక్షణతోపాటు తదుపరి సాగుకు ఊతం లభించింది. ప్రస్తుత వర్షాలు ఆ మేరకు భరోసా ఇచ్చాయి. రెండు రోజులుగా జిల్లాలో వాతావరణం చల్లబడింది. శనివారం పగటిపూట తెరపి లేకుండా వాన కురవగా నీటి వనరుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. పశ్చిమ ప్రాంతంలో అయితే ఏకంగా వాగులు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో తాజా పరిస్థితిపై యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్షాల తీవ్రతపై టెలి కాన్ఫరెన్స్‌లో ఆరా తీశారు.



కంభం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు వాగు

ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి నుంచి వాయుగుండం ప్రభావం బాగా కనిపించింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం కూడా ఒక మోస్తరు వర్షం కురిసింది. అలా శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో సగటున 25.1 మి.మీ. కురిసింది. అందులో గరిష్ఠంగా దోర్నాల మండలంలో 42.8 మి.మీ కురవగా చీమకుర్తిలో 41.4, మార్కాపురంలో 40.4, మద్దిపాడులో 40.2 మి.మీ కురిసింది మరో 20కిపైగా మండలాల్లో 25 నుంచి 40 మి.మీ కురవగా ఇతర మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. అంతేకాక శనివారం పగటిపూట కూడా జిల్లాలో ముసురుపట్టి వానలు పడ్డాయి. సాయంత్రం ఆరు గంటల సమయానికి ఒంగోలు మండలంలో ఏకంగా 97.75 మి.మీ నమోదు కాగా ముండ్లమూరులో 86.0, కురిచేడులో 82.0, చీమకుర్తిలో 67.0, మార్కాపురంలో 63.5, దొనకొండలో 58.0, కేకేమిట్లలో 57.0, పొదిలిలో 54.5, మార్కాపురంలో 53.0, కొండపిలో 52.0, ఒంగోలు నగరంలో 51.25 మి.మీ కురిసింది. ఇతర మండలాల్లోనూ మంచి వానలే పడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో కుంటలు, చెరువులు, వాగులు, వంకలు ఇతర నీటి వనరుల్లోకి నీరు చేరుతోంది.

ఉధృతంగా గుండ్లకమ్మ, ఇతర వాగులు

పశ్చిమ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్ద గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించగా కొందరు భక్తులు గుడి వద్ద చిక్కుకుపోయారు. ఆ సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పుల్లలచెరువు మండలం ఐటీవరం వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండగా గుండ్లకమ్మలోకి నీరు చేరుతోంది. కాగా జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాలలో సాగైన కంది, పత్తి, మిర్చి, ఇతర పంటలకు ప్రస్తుత వర్షాలు జీవం పోయడంతో పాటు తదుపరి వరి, పొగాకు, మినుము, మొక్కజొన్న ఇతరత్రా పంటలు సాగుకు ఉపయుక్తం కానున్నాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

- టోల్‌ఫ్రీ నెంబరు 1077

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు. ఈ కంట్రోలు రూము సోమవారం వరకు అందుబాటులో ఉంటుంది. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, మత్స్యశాఖ, ఆర్అండ్‌బీ, విద్యుత్, పశుసంవర్ధకశాఖ, వైద్యశాఖల ఉద్యోగులు ఈ రూములో పనిచేస్తారు. వర్షాలతో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు 1077 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కోరారు కంట్రోలు రూములో పనిచేసే సిబ్బంది ఆ సమస్యను నమోదు చేసుకొని సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారన్నారు. ఆయా శాఖల మధ్య సమన్వయం, సత్వరమే సమస్య పరిష్కారం కోసం ఈ కంట్రోలు రూమును ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు.

యంత్రాంగం అప్రమత్తం

ఇదిలాఉండగా తాజా వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడారు. జిల్లాలో పరిస్థితిని అడిగి తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో వర్షాల వల్ల ఎదురయ్యే పారిశుధ్యం, వ్యాధులు, రోడ్లు, విద్యుత్ అంతరాయం తదితర అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇదిలా ఉండగా కొత్తపట్నం తీర ప్రాంతంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లరాదని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు మంత్రి ఆదేశం
- వర్షాలపై ఫోన్‌లో సమీక్ష

కొండపి, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో పాటు వివిధ శాఖల అధికారులపై ఫోన్‌లో సమీక్షించారు. లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పశ్చిమ ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నందున ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద వాహనాల రాకపోకలను నిలువరించాలన్నారు. ఎటువంటి విపత్తు సంభవించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైన సహాయ చర్యలకు సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత జిల్లా అధికారిని ఆదేశించారు. అధికారులంతా కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతేనే బయటకు రావాలని మంత్రి స్వామి విజ్ఞప్తి చేశారు.

జోరువానలోనూ

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

సిబ్బందికి తోడుగా కూటమి కేడర్

వైపాలెం సెగ్మెంట్‌లో పాల్గొన్న మంత్రి స్వామి

89 శాతం మందికి అందజేత



వైపాలెం నియోజకవర్గంలోని దేవరాజుగట్టులో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి, ఎరిక్షన్‌బాబు, నాయకులు

ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. జోరువాన లోనూ ఉదయం ఆరు గంటల నుంచే జిల్లా అంతటా సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్ధిని అందజేశారు. వారికి తోడుగా కూటమి కేడర్, ప్రత్యేకించి టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు. అదేసమయంలో టీడీపీకి చెందిన ముఖ్యనాయకులు కూడా వారి వారి నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూలై 1న పింఛన్ మొత్తం రూ.4వేలతో పాటు మూడు నెలల బకాయి రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేయగా రెండవ నెల అయిన ఆగస్టు 1న తిరిగి రూ.4వేల వంతున అందజేశారు. ఇక మూడవ నెల అయిన సెప్టెంబరు 1న కూడా పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉండగా ఆరోజు ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ఆగస్టు 31నే అందజేశారు. జిల్లాలో మొత్తం 2,89,096 మంది వివిధ కేటగిరిల వారికి రూ.123.01 కోట్ల మొత్తం సామాజిక పింఛనుగా ఇవ్వడానికి ప్రభుత్వం ముందుగానే నిధులు మంజూరు చేసింది. శనివారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీని సిబ్బంది ప్రారంభించారు.

ఇంటింటికీ వెళ్లి

గత రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా వర్షాలు పడుతున్నా లెక్కచేయకుండా ఉదయం ఆరుగంటలకే సచివాలయ సిబ్బంది వారికి తోడుగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేపట్టారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి వైపాలెం నియోజక వర్గంలోని దేవరాజుగట్టులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు, మంత్రి స్వామిలు వర్షంలో తడుస్తూ, బురదమయంగా ఉన్న రోడ్లపై నడుస్తూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సొమ్మును పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హనుమంతునిపాడు మండలం మిట్టపాలెంలో పింఛన్ల పంపిణీని ప్రారంభించి అనంతరం కనిగిరి పట్టణంలోని 9వ వార్డులో పంపిణీ చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 21వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్ళి పింఛన్లు పంపిణీ చేశారు. మేయర్ గంగాడ సుజాత, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. దర్శి ఇన్‌చార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాల్లోనూ సాయంత్రం వరకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సిబ్బంది, నాయకులు ఉత్సాహంగా పంపిణీ చేశారు. అలా సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లాలో 89.12శాతంతో 2,57,635 మందికి సుమారు రూ.109.55 కోట్లు పంపిణీ చేశారు మిగిలిపోయిన వారికి సోమవారం ఇవ్వనున్నారు.

మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దు



మోటుపల్లి సముద్రతీరంలో మత్స్యకారులతో మట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు 31 : రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ వారి ఆదేశాల మేరకు మత్స్యకారులు ఎవరు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని తహసీల్దార్ జె.ప్రభాకరరావు ఆదేశించారు. మండలంలోని మోటుపల్లి తీరప్రాంతంలో శనివారం ఆయన మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం నిరీక్షణగిరి గ్రామాలకు చెందిన మత్సకారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు రెవెన్యూ అధికారులతో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు వారి హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి, పంచాయతీ కార్యదర్శితో కలిసి సందర్శించి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. అల్పపీడన ప్రభావం తగ్గే వరకు రెవెన్యూ అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు. కార్యక్రమంలో డీటీ దాసరి శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవో సీసీ డిప్యుటేషన్ రద్దు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 31 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై డీపీవో సీసీగా పనిచేస్తున్న పి.సాయికోటేశ్వరరావును రిలీవ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి టి.ఉషారాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి (డిజిటల్ అసిస్టెంట్) గ్రేడ్-6గా పనిచేస్తున్న సాయి కోటేశ్వరరావు గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పంచాయతీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. చెరుకూరులో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని సాయి కోటేశ్వరరావును రిలీవ్ చేయాలని ఇటీవల పొన్నలూరు ఎంపీడీవో డీపీవోకు లేఖ రాశారు. అయినా సాయి కోటేశ్వరరావును రిలీవ్ చేయకుండా కొనసాగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు డీపీవో శనివారం అతనిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అర్థవంతమైన ఆలోచనలు చేద్దాం అభివృద్ధిలో ముందుందాం

కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న చైర్మన్ జంజనం

చీరాల, ఆగస్టు 31 : అనవసర రాద్ధాంతాలు లేకుండా.. అర్థవంత ఆలోచనలతో అభివృద్ధిలో ముందుందామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో శనివారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో మెంబరు హోదాలో ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలలో ఒకటైన తాగునీటి సరఫరాకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు రూ.23.83కోట్ల నిధులు మంజూరుకు మున్సిపల్ కార్యాలయం వాటా కింద రూ.1.80 కోట్లు చెల్లించాల్సిన అంశంపై సుదీర్ఘచర్చ జరిగింది. దీనిపై చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖజానా ఖాళీ అయిందని, నిధులు చెల్లింపు చేస్తే ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి కూడా నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పారు. అందుకు సంబంధించి చైర్మన్ సూచన మేరకు డీఈ ఐసయ్య, ఆర్‌వో శ్యామల, అకౌంట్స్ ఆఫీసర్ రేఖారాణి ఆ నిధులకు చెల్లింపుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను వివరించారు. ఆ క్రమంలో కొందరు కౌన్సిలర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అందరి మాటలు విన్న ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.23.83 కోట్లు రాబట్టేందుకు మన వాటాగా రూ.1.80కోట్లు చెల్లించాల్సి ఉంది. అందుకు సంబంధించి సమయం కూడా ఉంది. ఆ మొత్తం చెల్లించలేమని ఎలా చెప్తాం. డీఈ, ఆర్‌వో, అకౌంట్స్ ఆఫీసర్ చెప్పిన వివరణల్లో సానుకూల అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ మొత్తం చెల్లిస్తే, మనకు రూ.23.83 కోట్లు మంజూరు అవుతాయన్నారు. అజెండాలోని 8 అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఆ అంశంపై జరిగిన చర్చ టీకప్పులో తుఫాన్ అయింది.

ఎమ్మెల్యే కొండయ్య కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఆలశ్యంగా వచ్చినా, అందరినీ మెప్పించారు. ఉదయం 11 గంటలకు ప్రారం భం కావాల్సి ఉండగా ఆ సమయానికి చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌లు ఇరువురు, ఆ వర్గ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. ఈ క్రమంలో కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎమ్మెల్యే అనుచర కౌన్సిలర్లు కొండయ్య కోసం వేచి చూస్తూ కౌన్సిల్ హాల్ కింద ఉన్నారు. ఈ క్రమంలో 11.37 గంటలకు ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి వారందరూ కౌన్సిల్ హాల్‌లో ప్రవేశించారు. కమిషనర్ చక్రవర్తి ఆయనతో సంతకం తీసుకున్నారు. అజెండాలోని 8 అంశాలు, సప్లిమెంటరీ అజెండాలోని 11 అంశాలకు సంబంధించిన చర్చలో ఎమ్మెల్యే తనదైన మార్క్ ప్రదర్శించి ఎక్కడా వివాదాలకు తావు లేకుండా అందరిని మెప్పించారు.

మొత్తంగా అత్యవసర అజెండాలోని 8 అంశాలు, సప్లిమెంటరీ అజెండాలోని 11 అంశాలు ఆమోదం పొందాయి. 12.55 గంటలకు సమావేశం ముగిసింది.

తప్పులు చేయొద్దు

నేనైనా, మీరైనా తప్పులు చేయొద్దు. పొరపాట్లు సహజం. సరిదిద్దుకుందాం. భవిష్యత్‌లో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. స్వాతంత్ర్య వేడుకల్లో జరిగిన పరిణామాలను చైర్మన్ జంజనం చెప్పే ప్రయ త్నాన్ని ఎమ్మెల్యే అడ్డుకున్నారు. అన్న క్యాంటీన్‌కు సంబంధించి ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం లేదని, శిలాఫలకం కూడా వేయలేదని చైర్మన్ ఆరోపించారు. సరిద్దిద్దుకుందాం, ఆ శిలాఫలకాన్ని ఏర్పాటు చేద్దామని చెప్పడంతో అందరు హర్షం వ్యక్తం చేశారు.

జీవో పూర్తిగా చదవండి

మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు సంబంధించి మంత్రి నారాయణ ఆదేశాల ను ప్రస్తావిస్తూ చైర్మన్ జంజనం ప్రస్తావించిన నేపథ్యంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవోను పూర్తిగా చదవండి. ఆ ప్రకారం నడుచుకోండని సూచించారు. ఆ క్రమంలో చైర్మన్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారులు జీవో సూచనల మేరకు నడుచుకోవాలని చెప్పారు. కుక్కలు, ఆవుల బెడదకు సంబంధించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25వేల విరాళం

చివరగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేసేవారు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అన్న క్యాంటీన్‌కు సహకరించాలని చెప్పగా కౌన్సిలర్లు మామిడాల రాములు రూ.25వేల విరాళాన్ని ప్రకటించారు. కౌన్సిలర్ అప్పల లక్ష్మి రూ.5వేలు అక్కడే అందజేశారు. మనవంతుగా రూ.50లక్షలు నియోజకవర్గంలో సమకూరుస్తారని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు.

కారుమంచి సొసైటీ సీఈవోపై వేటు

- ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగింపు
- ఉత్తర్వులు జారీచేసిన జాయింట్ కలెక్టర్

ఒంగోలు(విద్య), ఆగస్టు 31: టంగుటూరు మండలం కారుమంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) ఆత్మకూరి శ్రీకాంత్ పై వేటు పడింది. సొసైటీ నిధులు రూ.55.74 లక్షలను దిగమింగినందుకు ఆయనను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై జరిగిన విచారణలో శ్రీకాంత్ దోషిగా తేలారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకునేందుకు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జీ పలుమార్లు నోటీసులు జారీచేసినా సీఈవో స్పందించలేదు. దీంతో శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగించేందుకు అనుమతించమని సొసైటీ పీఐసీ మాలకొండయ్య జిల్లా సాయి ఎంపవర్‌మెంట్ కమిటీకి నివేదించారు. దీంతో పీడీసీసీ బ్యాంకు అధికార పర్సన్ ఇన్‌చార్జీగా ఉన్న జాయింట్ కలెక్టర గోపాలకృష్ణ అధ్యక్షతన డీఎల్ఈసీ సమావేశం నిర్వహించి శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఆమోద ముద్ర వేసింది.

రూ.55.74 లక్షలు గోల్‌మాల్

కారుమంచి సొసైటీలో సీఈఓ శ్రీకాంత్ భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ఆరేళ్ల పాటు సొసైటీ ఆడిట్ జరగకుండా అడ్డుకున్నారు. సొసైటీ మూడేళ్ల రికార్డులు మాయం చేశారు. అయితే అప్పటి డీసీఓ రాజశేఖర్ చొరవతో ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌లో భారీ మొత్తంలో నిధులు గల్లంతైనట్లు తేలింది. దీంతో ఆ అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఒంగోలు డీఎల్‌సీఓ కార్యాలయ అదనపు రిజిస్ట్రార్ కోట వీరయ్యను నియమించారు. విచారణలో శ్రీకాంత్ సొసైటీ నిధులు రూ.55.74 లక్షలు స్వాహా చేసినట్లు తేలింది. 45మంది రైతుల నుంచి వసూలు చేసిన రూ.43.18 లక్షలు బ్యాంకులో జమచేయకుండా దిగమింగారు. సొసైటీ నిధులు స్వాహా చేసినందుకు శ్రీకాంత్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు.





చీరాల : చెరువును తలపిస్తున్న మసీదు - చర్చి రోడ్డు.. పర్చూరు : వీరన్నపాలెం పంట పొలాలను ముంచెత్తిన వర్షపు నీరు.. ఇంకొల్లు : పూసపాడు అడ్డరోడ్డు వద్ద పొంగుతున్న వాగు

స్తంభించిన జనజీవనం

- ఎడతెరిపి లేకుండా వర్షం
- రోడ్లు జలమయం
- పాదచారులు, వాహనచోదకులకు తప్పని తిప్పలు
- అన్నదాతకు ఊరట

చీరాల, ఆగస్టు 31 : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో చీరాల మున్సిపల్ పరిధిలో పలుచోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. ఆ రోడ్ల వెంట రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మసీదు సెంటర్ నుంచి సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి మధ్య సుమారు రెండడుగులు మేర నీరు ప్రవహించింది. ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూలు ప్రాంగణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ నుంచి మహిళా కళాశాల మధ్య రోడ్డు జలసంద్రమైంది. నల్లగాంధీ బొమ్మ సెంటర్ నుంచి కొత్తపేటకు వేళ్లే దారిలో భాష్యం స్కూల్ వరకు రోడ్డు చెరువును తలపించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటితో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో వెలుపలకు పంపే మార్గం లేక ఇబ్బంది పడ్డారు. వర్షం కొంత తెరిపిచ్చి సమయంలో ఇళ్లలోకి చేరిని నీటిని వెలుపలకు పంపించారు. రైలు గేటు అవల బలహీనవర్గాల కాలనీ, దండుబాట ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వర్షంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పలు దుకాణాలు మూతపడ్డాయి. కొన్ని చోట్ల చెట్లు కొమ్మలు విరిగాయి. మొత్తంమ్మీద అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో పురప్రజలు ఇబ్బంది పడ్డారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ చక్రవర్తి తెలిపారు. ఎవరికి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు తమ అధికారులు, సిబ్బంది సమిష్టి కార్యాచరణతో పనిచేస్తున్నామని చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి

వేటపాలెం(చీరాల) : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కఠారివారిపాలెం తహసీల్దార్ పార్వతితో కలసి పర్యటించారు. ఆ సందర్భంగా మత్స్యకారులు వర్షప్రభాతంతో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని మత్స్యకారులకు భరోసా కల్పించారు. వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది కొణిజేటి చేనేతపురి తదితర ప్రాంతాలను పరిశీలించి వారి సాధక, బాధలు తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాలటౌన్ : గత రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలువలు జలమయం అయ్యాయి. దీంతో చెత్తా చెదారంతో కలిసి ప్రవహిస్తున్నాయి. వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వర్షాలు కారణంగా దోమలు గృహాల్లోకి చేరి ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అసలే డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగాల బారినపడుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ

మార్టూరు : వాయుగుండం ప్రభావం కారణంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం ప్రజా జీవితం స్తంభించింది. శనివారం ఉదయం నుంచి ఆగకుండా వర్షం కురుస్తూనే ఉంది. దాంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడం మానేశారు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రోజువారీ కూలీల పనులు ఆగిపోయాయి. మార్టూరులో పెద్ద అండరుపాస్ వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గ్రామాలలో ప్రాణ, అస్తి నష్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. గ్రామ వీఆర్వోలతో పాటు వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలను అప్రమత్తం చేశారు. మండలంలో భారీ వర్షాలకు పొంగి పొర్లే రాజుగారిపాలెం వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద, డేగరమూడి వాగుపై ఉన్న నేలచప్టా వద్ద పోలీసులు తిరుగుతున్నారు. రామ్‌నగర్‌లో గాలులకు చెట్టు కూలింది. పంచాయతీ సిబ్బంది వెళ్లి చెట్టును తొలగించారు.

కురుస్తున్న వానలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్టూరు, రాజుపాలెంలో బెట్ట కొచ్చిన పత్తిపై రైతుల్లో ఆశలు చిగురించాయి. వాన పెరిగితే నష్టమని అంటున్నారు. అలాగే మినుము రైతులకు ఊరటినిచ్చింది.

యద్దనపూడి మండలంలో తుపాన్‌పై అధికారులు అప్రమత్తం అయ్యారు. పోలూరు వాగు వద్ద, చిమటావారిపాలెం వాగువద్ద పోలీసు, రెవెన్యూ ఉద్యోగులతో బందోబస్తును ఏర్పాటు చేశారు.

పొంగుతున్న వాగులు

ఇంకొల్లు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పూసపాడు వంకాయలపాడు మధ్య ఉన్న వాగు పొంగి ప్రవహించడంతో ఇంకొల్లు పర్చూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కారంచేడు మీదగా రాకపోకలు సాగించారు. అక్కడ పోలీసు సిబ్బంది ఎటువంటి ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దుద్దుకూరు సమీపంలో ఉన్న వాగు పొంగింది. నక్కలపాలెం నాగండ్ల మధ్య వాగు పొంగి ప్రవహించింది. కొన్ని గ్రామలకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందిపడ్డారు. పొలాల్లో నీరు చేరింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పర్చూరు : రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయ్యాయి. దీంతో వాహనచోదకులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శివారు కాలనీలలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే మురుగు నీరు పొంగిపొర్లుతుంది. కొట్ల బజారు, చీరాల పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారి, నెహ్రూకాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్‌లో పరిస్థితి దయనీయంగా ఉంది.

కొన్ని నెలలుగా వానల కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు ఊరట లభించింది. ఖరీఫ్ సాగుకోసం పొలాలను దున్నిన రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. కురిసిన వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేశవరప్పాడు - తిరిడితపాడు మధ్య అలుగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కారంచేడులో వేల ఎకరాల్లో వరి పైర్లు నీటమునిగాయి. కారంచేడు కేశవరప్పాడు - తిమిడిపాడు మధ్య అలుగువాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి అలుగువాగును పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

ఖరీఫ్‌కు ఊపిరి

పంగులూరు : ప్రస్తుతం కురుస్తున్న వానలు ఖరీఫ్‌లో సాగుకు ఊపిరిపోశాయని రైతులు చెప్తున్నారు. పలు గ్రామాల్లో 1800 ఎకరాల్లో మినుము, మొక్కజొన్న, పెసర, మిరప, పత్తి, కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. కొద్ది నెలలుగా వాన కోసం రైతులు ఎదురుచూస్తుండగా శుక్ర, శనివారాలు కురిసిన వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదు సెంటీ మీటర్లకు పైగా వాన కురవడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.



తిమిడితిపాడు - కేశవరప్పాడు మధ్య పొంగుతున్న వాగు

ప్రయాణికులకు ఇబ్బందులు

సంతమాగులూరు : వెల్లలచెరువు వద్ద నిర్మించిన రైల్వే అండరు బ్రిడ్జి వద్ద వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని కొప్పరం - బండివారిపాలెం, మామిళ్ళపల్లి - కుందుర్రు, చవిటిపాలెం - గురిజేపల్లి, మిన్నెకల్లు - సంతమాగులూరు గ్రామాల మధ్య గల వాగులు ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సాగరు ఆయకట్టు పరిధిలో వరి నారు మళ్లను రైతులు సిద్ధం చేశారు. పత్తి, కూరగాయల పంటలు కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దు చేసిన బస్ సర్వీసులు

అద్దంకి : వాయుగుండం ప్రభావంతో శనివారం వేకువజాము నుంచి పొద్దుపోయే వరకు రోజంతా వర్షపు జల్లులు పడుతునే ఉన్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. అద్దంకి పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. ఇప్పటి వరకు పొలాలకు సరిపడా వర్షం లేక రైతులు ఎదురు చూస్తుండగా శనివారం నాటి వర్షం రైతులకు ప్రయోజనం చేకూరింది. ఈ జల్లులు ఆది, సోమ వారాలలో కూడా పడితే ఇప్పటికే సాగు చేసి ఉన్న పంటలకు కొంతమేర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్లపు పొలాలలు జలమయంగా మారాయి. వాగులలో నీటి ప్రవాహం ప్రారంభమైంది. నీటి వాడకం లేకపోవడంతో బ్రాంచి కాలువ నిండుగా ప్రవహిస్తోంది. పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం పిట్టంబండ, ఉమ్మడివరం మధ్య ఉన్న వాగుకు నీటి ప్రవాహం రావడంతో అద్దంకి-వినుకొండ బస్ సర్వీసులు సాయంత్రం రద్దు చేశారు. ప్రయాణికులు లేరని పలు రూట్లలో బస్సులను మధ్యాహ్నం నుంచి ఆపేశారు.

చినగంజాంలో భారీ వర్షం

చినగంజాం : వాయుగుండం కారణంగా చినగంజాం ప్రాంతంలో రెండు రోజులుగా ఈదులు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో పోసిన నారుమడులలో వర్షపు నీరు నిలబడం, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలోని సంతరావూరు, గొనసపూడి, తిమ్మసముద్రం ప్రాంతాల్లో రైతులు ఇటీవల నారుమడులు పోశారు. వర్షం ఎక్కువగా పడడంతో నారుమడులో నీరు నిలిచింది. రెండు రోజులుగా వర్షం కురవడం వలన రొయ్యల చెరువులకు కూలింగ్ సమస్య ఏర్పడిందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకసోకలకు ఇబ్బందిగా మారింది. సంతరావూరు లాకుల వద్ద 24 గంటల విద్యుత్ కొరకు వేసిన నూతన విద్యుత్ స్తంభాలు గాలులకు 11కేవీ విద్యుత్ తీగలపై పడిపోవడం వలన సంతరావూరు గ్రామానికి శనివారం రాత్రి వరకు కరెంట్ లేకపోడవంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.






కఠారిపాలెంలో మాట్లాడుతున్న ఆర్డీవో, తహసీల్దార్..మార్టూరులో గాలికి పడిపోయిన చెట్టు..సంతమాగులూరు : రైల్వే బ్రిడ్జి వద్ద వరద నీరు.. సంతరావూరులో నారు మళ్లలో నిలిచిన వాన నీరు




ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీస్తున్న అధికారులు

జాతీయ రహదారి పక్కన కల్వర్టుకు అడ్డంగా మెరక తోలిన భూమి

కల్వర్టుకు అడ్డంగా మెరక

- నిలిచిన నీటి ప్రవాహం .. చెరువు తెగుతుందని ఆందోళన
- జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది : అధికారులు

మేదరమెట్ల, ఆగస్టు 31 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పొలాల్లోని నీరంతా వాగులోకి వచ్చి చేరుతోంది. దీంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న తిమ్మనపాలెం చెరువుకు భారీగా నీరు చేరుతోంది. జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువు అలుగు నుంచి బయటకు వచ్చే నీరు జాతీయ రహదారిని దాటి వాగులో వెళ్లి కలుస్తోంది. జాతీయ రహదారికి తూర్పు, పడమరవైపున ఉన్న పొలాల్లోని నీరంతా, ఈ కల్వర్టు వద్దకే చేరింది. దీంతో ఈ కల్వర్టు వద్ద నీటి ప్రవాహం పెరిగింది. ఈ వేసవిలో కల్వర్టు ఎదురుగా ఉన్న భూమిని దాదాపు ఐదు అడుగులకు పైగా ఎత్తు లేపడంతో ప్రవాహానికి అడ్డంకి ఏర్పడ్డంతో నీరంతా కల్వర్టు వెనుకవైపున నిలిచిపోయింది. తిమ్మనపాలెం చెరువు కూడా నిండుతోంది. పొలాల్లో నుంచి వచ్చే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల చెరువు అలుగు నుంచి వచ్చే నీరు రాకండా ఆగిపోయి చెరువు కట్ట తెగుతుందేమోనని రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు శనివారం ఉదయం నుంచి ఇక్కడకు వచ్చి పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి అధికారులు సర్వీసురోడ్డు కోసం నిర్మించిన కల్వర్టు పక్కగా ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీయడంతో వెనుకవైపు ఉన్న కొంత వరకు తగ్గింది. ఇంకా ఎక్కువ వర్షం కురిస్తే ఈ ప్రమాదం తీవ్రమై జాతీయ రహదారిపై నీరు చేరుతుందని జాతీయ రహదారి అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనంతటికీ కారణం చెరువు అలుగుకు ఎదురుగా ఉన్న భూమిని మెరకలేపటమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అక్కడున్న పక్కపొలాల కన్నా ఈ పొలాన్ని ఐదు అడుగుల కన్న ఎత్తు లేపడంతో నీటి ప్రవాహానికి అడ్డమైంది. భవిష్యత్తులోనైనా ఇక్కడ కాలువను పెద్దది చేసి నీరు సక్రమంగా ప్రవహించడానికి మార్గం ఏర్పాటు చేయకపోతే ఈ ప్రమాదం ఎప్పటికీ పొంచి ఉంటుంది.

శింగరకొండలో యాచకుడు మృతి

అద్దంకి, ఆగస్టు 31 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం సమీపంలో గుర్తు తెలియని యాచకుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు దేవాలయం వెనుక మహిళలు దుస్తులు మార్చుకునే రేకుల షెడ్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని భిక్షాటన చేసే వృద్ధుడు మృతి చెంది ఉండగా, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. బంధువులు, తెలిసిన వ్యక్తులు ఎవరైనా ఉంటే 9121102167, 8978777290 సెల్ నెంబర్‌లను సంప్రదించాలని సీఐ కృష్ణయ్య కోరారు.

వానలోనూ పింఛన్‌ల పంపిణీ

- చెప్పింది చేస్తాం..చేసేదే చెప్తాం
- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 31 : సీఎం చంద్రబాబు చేసేదే చెప్తారు. చెప్పింది చేస్తారు. ప్రతి నెల 1వ తేది పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఆ రోజు ఆదివారం కావటంతో ముందు రోజే పెన్షన్లు పంపిణీ జరిపించటం అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయితీ పరిధిలో ఉదయం 6 గంటలకే పెన్షన్లు పంపిణీలో పాల్గొన్నారు. ఆయనతో యువ నాయకులు ఎం. గౌరీ అమర్‌నాథ్, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ ఎం. మహేంద్రనాథ్‌లు పాల్గొన్నారు. జోరు వర్షంలో కూడా పలు గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కూడా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ పెన్షన్లు పంపిణీలో జిల్లాలో మొదటి స్థానంలో చీరాల, రెండో స్థానంలో వేటపాలెం ఉందని చెప్పారు. అన్ని రకాల పెన్షన్లను లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో పెన్షన్లు పంపిణీ వర్షంలో కూడా ఒక యజ్ఞంలా సాగింది. ఆయా కార్యక్రమాల్లో వార్డు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేశారు.



కారంచేడులో పింఛన్లను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి : ఒకవైపు జోరున వర్షం పడుతున్నా శనివారం ఉదయం పింఛన్‌లను పంపిణీ ప్రారంభించారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం లబ్ధిదారులకు పింఛన్‌లను అధికారులు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు.

బల్లికురవ : జోరు వానలోనూ అధికారులు పింఛన్‌ల పంపిణీ చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పంపిణీ చేపట్టారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు వర్షంలో గొడుగులు వేసుకొని ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. చెన్నుపల్లి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి సురేంద్ర, ఎంపీడీవో రాంబాబులు పరిశీలించారు. మంచంపై ఉన్న వృద్ధులకు పింఛన్‌లను అందజేశారు. పింఛన్ పంపిణీ పర్యవేక్షక అధికారి తహసీల్దార్ రవి కుమార్, ఏవో కుమారి, ఏఈ హనుమంతు రావులు పరిశీలించారు. తొలిరోజు 90 శాతం పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాంబాబు తెలిపారు.

పర్చూరు : ప్రభుత్వం ఒక రోజు ముందుగా తలపెట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అధికారులు జోరు వానలోనూ సమర్థవంతంగా నిర్వహించారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌లను అందజేశారు. ఒక పక్క జోరు వాన, గాలులు వీస్తున్నా తమ స్వూనే పింఛన్‌లను పంపిణీ చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది తోపాటు, ఆయా శాఖల అధికారులు ఉదయం 5గంటలకే ఇళ్ల వద్దకు వెళ్లి వృద్ధులకు, మిగతా అర్హులకు పింఛన్‌లను అందజేశారు. మండలంలో మొత్తం రూ.3,46,70,000 కోట్ల నగదును పంపిణీ చేసినట్లు ఈవోఆర్డీ రామకృష్ణ తెలిపారు. అలాగే కారంచేడు మండలంలోని ఆయా గ్రామాల నుంచి సచివాలయ సిబ్బంది నేతృత్వంలో ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు.



అద్దంకిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ



చెన్నుపల్లిలో మంచాన ఉన్న వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్ర, ఎంపీడీవో రాంబాబు



కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి

డీఎంహెచ్‌వో విజయమ్మ

పర్చూరు, ఆగస్టు 31 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు దృష్ట్యా మురుగనీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ అన్నారు. శనివారం నిర్వహించిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆమె పర్చూరు వచ్చారు. గ్రామంలో నిర్వహించిన పింఛన్‌ల పంపిణీని పరిశీలించారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల బెడద పెరిగిపోవడం, ప్రజలు జ్వరాల బారిన పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె పంచాయితీ అధికారులతో కలసి పారిశుధ్య పనులను, మురుగు కాలువలను పరిశీలించారు. బొమ్మల సెంటర్ కూడలిలో ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి రోగాలు ప్రబలకుండా చూడాలని డీఎంహెచ్‌వో విజయమ్మ సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డి రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి మహ్మద్ గౌస్ భాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

చీరాల, ఆగస్టు 31 : ముంతావారి సెంటర్లోని ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం వాసవీ క్లబ్, వాసవీ ఇంటర్నేషన్‌లో వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ శిబిరంలో గుండె, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వల్లంపట్ల తెలిపారు.

యువకుడి మృతిపై కేసు



పరిశీలిస్తున్న ఎస్ఐ చౌదరి

బల్లికురవ, ఆగస్టు 31 : బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో జిలేబీ అమ్మకాలు చేసే రాజస్థాన్‌కు చెందిన యువకుడు లక్ష్మణ్ బేకేధర్ విద్యుదాఘాతంతో మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. శనివారం ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఆగస్టు 31 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయ సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు అన్నారు. ఈనెల 3వ తేదీన వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు పలు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు వివరించారు. అంతేకాకుండా ఉద్యోగాలకు 120కు పైగా ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7981443777 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 సంప్రదించాలన్నారు.

వస్త్ర దుకాణ గుమస్తా బలవన్మరణం



అద్దంకిరెడ్డి


చీరాలటౌన్, ఆగస్టు 31 : చీరాల పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్న వ్యక్తి శనివారం బలవన్మరణం చెందాడు. ఈఘటన చీరాల మండలం పాత చీరాల గ్రామం రామాలయం సమీపంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శవనం అద్దంకి రెడ్డి (43) చాలాకాలంగా పట్టణంలో గుమస్తాగా పని చేస్తున్నారు. ఇతనికి భార్య విజయలక్ష్మి, కుమారుడు గోపిరెడ్డి ఉన్నారు. విషయమేమిటో తెలియదు గానీ శనివారం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బంధువులు చెప్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, ఆగస్టు 31 : వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తమై పంటలు కాపాడుకోవాలని ఏవో కుమారి తెలిపారు. శనివారం పలు గ్రామాలలో సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి, వరి పొలాల్లో వరద నీరు ఉంటే బటయకు పంపించాలన్నారు. ఎకరాకు 50 కేజీల యూరియా 20 కేజీల పొటాష్ ఎరువునుపై పాటుగా వేసుకోవాలని ఏవో సూచించారు. కాండం తొలిచే పురుగు అధికం అయ్యే అవకాశం ఉందని రైతులు ఫ్రిఫనోపాసి 400 మీల్లీ లీటర్లను ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పత్తి సాగు చేసిన రైతులు ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను ఎరువును వేసుకోవాలన్నారు. ఆకు పచ్చ పరుగు వచ్చే ప్రమాదం ఉందని రైతులు వర్షాలు తగ్గిన తదుపరి సాఫ్ అనే శిలింధ్రనాశిని 2 గ్రాముల చొప్పున లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు.

ప్రైవేటు వైద్యశాల వద్ద ఆందోళన

- గర్భిణికి మగశిశువు మృతదేహాన్ని అప్పజెప్పిన వైనం
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన




చీరాలటౌన్, ఆగస్టు 31 : శనివారం రాత్రి చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాల వద్ద ఆందోళన వాతావరణం నెలకొంది. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన బ్లెస్సీ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు చెందిన లాలం హర్ష భార్యాభర్తలు. బ్లెస్సీ నెలలు నిండంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. శనివారం డెలివరీ నిమిత్తం బ్లెస్సీ మామ కొరిశపాడు ఎంఈవో పున్నయ్య కోడలిని ఆసుపత్రిలో చేర్చారు. అప్పటి వరకూ బాగానే ఉందని చెప్పిన వైద్యులు డెలివరీ చేసి రాత్రికి మృత మగశిశువును అప్పగించారు. దీంతో ఆశ్చర్యపోయిన బంధువులు వైద్యుల నుంచి వివరణ కోరగా.. శిశువు స్థితిగతులు బాలేదని అందుకే మృతిచెందినట్లు చెప్పారు. దీంతో ఒక్కసారిగా అందరూ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు హాస్పిటల్ వద్దకు చేరుకుని సర్దుబాటు చేసే పనిలో పడ్డారు.

స్కూల్ బస్సు బోల్తా

సంతమాగులూరు, ఆగస్టు 31 : కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామంలో ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు ఉన్నారు. వెంటనే గమనించిన పాతమాగులూరు ప్రజలు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. స్వల్పగాయాలతో విద్యార్థులు బయటపడ్డారు.



రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లిన స్కూల్ బస్సు



విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

● నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ) : నగరంలోని లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. శనివారం రాత్రి కార్పొరేషన్ యంత్రాంగంతో కలిసి ఆయన లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. విపత్తు ఎలా వచ్చిన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డ్రైన్లలో పూడికతీసి నీళ్ల సులువుగా బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని, ఎక్కడెక్కడ వరద ప్రభావం ఉంటుందో అక్కడ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అండర్ బ్రిడ్జీల వద్ద నీరు నిలబడకుండా చూడాలన్నారు.

అలెర్ట్!



శనివారం సాయంత్రం నెల్లూరు నగరాన్ని కమ్మేసిన మబ్బులు

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ)
కందుకూరు	14.6
ఇందుకూరుపేట	13.4
దగదర్తి	12.4
ఉలవపాడు	12.2
సీతారామపురం	12.2
ఉదయగిరి	10.2
కొండాపురం	10.2
వెంకటాచలం	9.4
కావలి	9.2
లింగసముద్రం	8.6
జలదంకి	8.4
వలేటివారిపాళెం	8.4
టీపీ గూడూరు	7.8
గుడ్లూరు	7.4
అల్లూరు	6.4
విడవలూరు	6.4
పొదలకూరు	6.2
బోగోలు	6.2
కోవూరు	6.0
ముత్తుకూరు	5.6
కొడవలూరు	5.4
సైదాపురం	5.4
కలువాయి	5.4
మర్రిపాడు	5.2
వింజమూరు	5.2
నెల్లూరు రూరల్	4.6
ఆత్మకూరు	4.6
నెల్లూరు అర్బన్	4.2
కలిగిరి	4.2
బుచ్చిరెడ్డిపాళెం	4.2
సంగం	4.0
మనుబోలు	3.6
రాపూరు	2.4
వరికుంటపాడు	2.4
అనుమసముద్రంపేట	2.2
అనంతసాగరం	1.8
దుత్తలూరు	1.4
చేజర్ల	12

● బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం ● జిల్లా అంతటా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు ● అధికార యంత్రాంగం అప్రమత్తం



కందుకూరులో కురుస్తున్న వర్షం

నెల్లూరు (హరనాథపురం): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లా అంతటా వర్షం కురిసింది. ఆదివారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్త మైంది. శనివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లమీద నీళ్ల నిలిచాయి. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలక రోడ్లపై చేరాయి. చాలా ప్రాంతాల్లో మురుగునీటి దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద ఈ వర్షంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. ప్రతి రోజూ 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుండగా, శనివారం 28 డిగ్రీలకు పడిపోయింది. కాగా, జిల్లా వ్యాప్తంగా శనివారం సగటు వర్ష పాతం 6.5 మి.మీగా నమోదైంది.

● **పంటలకు మేలు**

కందుకూరు : వాయుగుండం ప్రభావంతో కందుకూరు ప్రాం తంలో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లకు ఈ వర్షం జీవం పోయడమేగాక నెల రోజుల క్రితం విస్తా రంగా వేసిన జామాయిలుకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక మిరప, పొగ నారు మడుల సాగుకు కూడా ఎంతో అనుకూలి స్తుందని, భూములు పూర్తి స్థాయిలో పదును కావడంతో జామా యిలు, పండ్ల తోటలు విస్తారంగా నాట్లు వేసేందుకు అనుకూల వాతా వరణం నెలకొందని భావిస్తున్నారు. మరోవైపు పారిశుధ్య పరి స్థితులు అధ్వానంగా మారాయి. రోడ్లు కూడా అధ్వానంగా మారాయి. గ్రామీణ లింకు రోడ్లు, గ్రావెల్ రోడ్లలో బురదగా మారడంతో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు సైతం గుంత లమయంగా మారి ఉండ టంతో ఆ గుంతల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

● 3వ తేదీ వరకు వర్షాలు
● అధికారులకు కలెక్టర్ ఆదేశం
● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

నెల్లూరు (హరనాథపురం) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు విపత్తుల నిర్వహణ సంస్థ సెప్టెంబరు 3వ తేదీ వరకు భారీ వర్షాల కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల వల్ల ఎక్కడైన సమస్యలు తలెత్తితే తక్షణ సాయం కోసం ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నెంబరు 0861-233 1261, 1077కు కాల్ చేయాలని కోరారు. ఈ కంట్రోల్ రూముకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందికి విధులు కేటాయించామని తెలిపారు. జిల్లా అధికారులు కూడా తమ కార్యాలయాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని వర్షాల వల్ల పంటలు, ఇతర నష్టాలు సంభవిస్తే ప్రతి రోజు తనకు నివేదకలు పంపాలని ఆదేశించారు.

● **విద్యుత్ శాఖలో సెలవుల రద్దు**

నెల్లూరు (జడ్పీ) : తుపాన్ ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ కంట్రోలు రూమ్‌లను ఏర్పాటు చేసింది. ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరు ఆదిశేషయ్యను నెల్లూరు ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన శనివారం నెల్లూరుకు చేరుకుని అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని 7డివిజన్లలో కంట్రోలు రూమ్‌లను ఏర్పాటు చేయించారు. గూడూరు డివిజన్‌కు 7901036852, నెల్లూరు రూరల్ డివిజన్‌కు 9381815083, నెల్లూరు టౌన్ డివిజన్‌కు 7901642857, కోవూరు డివిజన్‌కు 832808 2583, కావలి డివిజన్‌కు 7901056437, ఆత్మకూరు డివిజన్‌కు 7901056906, నాయుడుపేట డివిజన్‌కు 7382623178 టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయడంతోపాటు అదనంగా విద్యుత్ భవన్‌లో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 9440817468 నెంబర్‌ను కేటాయించారు. అలాగే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సెలవులను రద్దు చేసి, అందరూ హెడ్‌క్వార్టర్లలోనే ఉండాలని సూచించారు.



నెల్లూరు : వర్షంలో ద్విచక్ర వాహనదారుడి ప్రయాణం

రూ.18.9 కోట్లతో వేదగిరికి 'ప్రసాదం'

● నరసింహకొండకు పర్యటక హంగులపై కలెక్టర్ ఆరా
● ఆలయం వద్ద అధికారులతో సమీక్ష

నెల్లూరురూరల్, ఆగస్టు 31 : ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం వేదగిరి క్షేత్రానికి దక్కనున్నది. ఈ మేరకు కలెక్టర్ ఓ ఆనంద్ పర్యటక అధికారులతో కలిసి శనివారం నరసింహకొండ పరిసరాల్లో ఏర్పాట్లు, నిర్మించబోయే పనులపై స్వయంగా పరిశీలించారు. ప్రసాదం స్కీం కింద తొలుత రూ.18.90 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. వీటితో ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టాలన్నది ఆలయ అధికారులు, పర్యటక శాఖ బృందంతో కలిసి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో రాగిపూత, శ్లాబు నిర్మాణాలు, అన్నదాన సత్రం విస్తరణ, భక్తుల విశ్రాంతి హాలు, టికెట్ కౌంటర్, క్లాక్‌రూం, క్యూలైన్లు, పార్కింగ్, విగ్రహాల వద్ద పార్కుల నిర్మాణం వంటి పనులు పూర్తి చేస్తే వేదగిరి క్షేత్రానికి ఆకర్షణ వస్తుందని, తద్వారా భక్తులకు ఆహ్లాదం, ఆధ్యాత్మిక భావన కలుగుతుందన్నారు. మరిన్ని పనులను అందరితో చర్చించి పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు ఆలయంలోకి స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల సన్నిధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అక్రమ నిర్మాణాలపై స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు షఫీమాలిక్


అక్రమ కట్టడాలు ఆపేయండి!

● ఆక్రమిస్తే కఠిన చర్యలు : తహసీల్దారు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాన్ని నగర తహసీల్దారు షఫీ మాలిక్ శనివారం పరిశీలించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రభుత్వ స్థలమేగా చేసేయ్ కబ్జా' అన్న కథనానికి ఆయన స్పందించి వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ వద్ద ప్రభుత్వ భూములను పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలకు త్వరలో నోటీసులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'సోమశిల'కు జలకళ.. రైతుల కళ్లలో ఆనందం

● నెల వ్యవధిలో 26 టీఎంసీల నీరు చేరిక



అనంతసాగరం, ఆగస్టు 31 : ఎగువ నుంచి వస్తున్న కృష్ణా జలాలతో సోమశిల జలాశయం కొత్త శోభ సంతరించుకొంది. జూలై 27న శ్రీశైలం జలాశయం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బనకచర్లకు నీటిని విడుదల చేశారు. అక్కడ నుంచి తెలుగు గంగ ద్వారా కొనసాగిన వరద ఆగస్టు 2 నాటికి సోమశిలకు చేరింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా క్రమేణా పెరుగుతూ.. తగ్గుతూ కృష్ణా జలాల ప్రవాహం కొనసాగుతోంది. వరద రాక ముందు సోమశిలలో 9.893 టీఎంసీల నీటిమట్టం ఉండగా శనివారానికి 35.888 టీఎంసీలకు చేరుకొంది. అంటే నెల రోజుల వ్యవధిలో 26 టీఎంసీల నీరు లబ్ధి చేకూరింది. దీంతో జిల్లా రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వస్తున్న ప్రవాహంలో దిగువ కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000, పవర్ టెన్నల్ ద్వారా డెల్టాకు 550, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నిఘా కళ్లకు నిద్ర మత్తు!

నేర పరిశోధనలో, నేరస్థులను గుర్తించడంలో అత్యంత కీలకమైన సీసీ కెమెరాలు జిల్లాలో కునుకు తీస్తున్నాయి. నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతం చేసేదిశగా 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రజా ధనంతో కొన్ని.. దాతల దాతృత్వంతో కొన్ని కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే, గత వైసీపీ సర్కారు పట్టించుకోకపోవడం, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణలోపంతో స్తంభాలపై దిష్టిబొమ్మల్లా వేలాడుతున్నాయి.



నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేట కూడలిలో నిరుపయోగంగా..



ఆత్మకూరులో దిష్టిబొమ్మలా..

నేర పరిశోధన కోసం 2014-19 మధ్య సీసీ కెమెరాల ఏర్పాటు
అప్పటి టీడీపీ ప్రభుత్వం, దాతల చొరవ
ఆ తర్వాత గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
నిధుల లేమితో పోలీస్ అధికారుల నిర్లక్ష్యం
దిష్టిబొమ్మల్లా వేలాడుతున్న నిఘా నేత్రాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : 2014-19 మధ్య కాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతం చేసే క్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాల అమరికను ప్రోత్సహించింది. అన్ని పట్టణాలు, ప్రధాన రహదారులను కలిపే గ్రామీణ ప్రాంతాలను ఎంపిక చేసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించింది. వీటితోపాటు దాతల వివరాళాలతో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ జిల్లా పోలీసు కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో 427 కెమెరాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించింది. ఇక దాతల సహకారంతో 500 కెమెరాలను ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతను స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి అప్పగించారు.

● **'మ్యాట్రిక్' మొక్కుబడే!**

ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన 427 కెమెరాల నిర్వహణను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించినా కారణాలేమోగానీ మూడేళ్లుగా పట్టించుకోలేదు. పాడైన వాటినీ బాగు చేయడం లేదు. నెల్లూరులోనే 350 వరకు మ్యాట్రిక్ కెమెరాలు అమర్చగా 30 శాతం కూడా పని చేయడం లేదు. ఆత్మకూరు బస్టాండు, రైల్వేస్టేషన్, స్టోన్‌హౌస్‌పేట వంటి ముఖ్యమైన కూడళ్లలో కెమెరాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. ఇక కావలిలో మానస థియేటర్, బంగారపు కొట్ల బజారు, వెంకటేశ్వర థియేటర్, రామిశెట్టి మిల్లు, జెండా సెట్ సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్.. ఇలా ముఖ్యమైన కూడళ్లలో 30కిపైగా కెమెరాలు అమర్చినా ఒక్కటీ పని చేయడం లేదు.

● **నిరుపయోగమైన దాతల సాయం**

దాతల ఆర్థిక సాయంతో జిల్లావ్యాప్తంగా 500లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ మూడేళ్లకు ముందే మూలనపడ్డాయి. ఉన్నతాధికారుల మెప్పు కోసం దాతలపై ఒత్తిడి తెచ్చి కెమెరాలు ఏర్పాటు చేయడంలో చూపిన శ్రద్ధ వాటి నిర్వహణలో చూపలేదు. వీటి నిర్వహణ బాధ్యతను సర్కిల్ పోలీసు కార్యాలయం చూసుకోవాలి. కానీ ఆ కార్యాలయ అధికారులు నిధుల కొరత పేరుతో సీసీ కెమెరాలను గాలికి వదిలేశారు.

● **కమాండ్ తప్పిన కంట్రోల్ రూమ్స్!**

డివిజన్ల వారీగా సీసీ కెమెరాలను అనుసంధానం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కోసం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మ్యాట్రిక్ కెమెరాలను అనుసంధానం చేశారు. అయితే కెమెరాలే పని చేయకపోవడంతో కమాండ్ కంట్రోల్ రూంలు నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూం పరిధిలో 427 మ్యాట్రిక్ కెమెరాలతో పాటు దాతల సాయంతో అమర్చిన 500 కెమెరాలు అనుసంధానం చేశారు. అయితే ప్రస్తుతం వీటిలో 30 శాతం కూడా పని చేయడం లేదని సమాచారం.

● కావలి పట్టణంలో ఏర్పాటు చేసిన 30 మ్యాట్రిక్ కెమెరాలతోపాటు దాతల విరాళంతో అమర్చిన 40 కెమెరాలను అనుసంధానం చేస్తూ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అయితే వీటిలో ఒక్క కెమెరా కూడా పనిచేయకపోవడంతో రెండేళ్ల క్రితమే ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ మూతపడింది. జిల్లావ్యాప్తంగా సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సిస్టమ్స్ కూడా మూలనపడినట్లు సమాచారం. అలాగే ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో 364కు పైబడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 40 మాత్రమే పని చేస్తున్నట్లు తెలుస్తోంది.



పొదలకూరులో నిరుపయోగంగా..



కావలిలో మూతపడిన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం

● **అంతులేని నిర్లక్ష్యం!?**

నేర పరిశోధనలో సీసీ కెమెరాల వ్యవస్థ అత్యంత కీలకం. ఇప్పటివరకు ట్రేస్ అవుట్ అయిన కేసుల్లో అత్యధిక శాతం సీసీ ఫుటేజీల పాత్ర కీలకం. నేరారోపణలకు సంబంధించి కోర్టులో కేసులు నిలబడాలన్నా సీసీ ఫుటేజీలు చాలా ఉపయోగపడతాయి. కీలకమైన సీసీ కెమెరాల వ్యవస్థను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, పోలీసు ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరి అవలంబించడం ప్రజల దురదృష్టం. కూటమి ప్రభుత్వమైనా సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్ఠం చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఒక్క రోజు ముందుగానే ఎన్టీఆర్ 'భరోసా'!

● 95 శాతం పెన్షన్ల పంపిణీ ● చరిత్ర సృష్టించిన ప్రభుత్వం



పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 29 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని అనుకున్న రోజు కంటే ఒకరోజు ముందే పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. శనివారం తెల్లవారు జాము నుచంప వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షను సొమ్ము అందజేశారు. సెప్టెంబరు 1న పంపిణీ చేయాల్సిన పింఛన్‌ను ఒకరోజు ముందే అంటే శనివారమే 95 శాతం పంపిణీ చేశారు. అత్యధికంగా కోవూరు, నెల్లూరు, రాపూరు, బుచ్చి, సైదాపురం తదితర ప్రాంతాలలో అందజేశారు. గత ప్రభుత్వంలో ఐదు రోజులపాటు పెన్షన్ల పంపిణీ జరిగేది. వేల సంఖ్యలో వలంటీర్లు ఆ పెన్షన్ల పంపిణీ కోసం పని చేశారు. వలంటీర్లు లేకపోతే ఏ పని చేయలేరని వైసీపీ పెద్దలు పేర్కొనేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వలంటీర్లు లేకుండానే ప్రభుత్వ సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు. జిల్లాలో 3.12 లక్షల లబ్ధిదారులకు రూ.132.30 కోట్ల పెన్షన్ సొమ్ము విడుదలైంది. 768 సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం నుంచే పంపిణీ చేశారు. ఈ రోజు నగదు తీసుకోని వారికి సోమవారం నగదు అందజేయనున్నారు.



లబ్ధిదారుడికి పింఛను సొమ్ము ఇస్తున్న కలెక్టర్ ఆనంద్

● శనివారం తెల్లవారుజామునే వర్షంలోనే రాష్ట్ర మంత్రి నారాయణ నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో లబ్ధిదారులకు పెన్షన్ అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్ ఆనంద్ నెల్లూరు నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు.

నుడా వీసి బాపిరెడ్డి బదిలీ

నెల్లూరు (జడ్పీ) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వీసీ బాపిరెడ్డిని బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మాతృ శాఖ అయిన రెవెన్యూ శాఖలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. నుడా ఇన్‌చార్జి బాధ్యతలను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు అప్పగిస్తూ జీవో జారీ అయ్యింది. కాగా, వీసీ బాపిరెడ్డి శనివారమే రిలీవ్ అయ్యారు.

● **కార్పొరేషన్ కార్యదర్శిగా..**

నెల్లూరు(సిటీ) : నెల్లూరు కార్పొరేషన్‌లోని సెక్రటరీగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫాజుల్లాను నియమిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ను రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించినా శనివారం జారీ అయిన ఉత్తర్వుల్లో నెల్లూరు సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘల్ పేర్కొన్నారు. ఓన్ పే పైన ఆయన ఇక్కడ పని చేయనున్నారు.

ప్రారంభించకనే శిథిలావస్థకు..

- నిరుయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- రూ.లక్షల ప్రభుత్వ ధనం దుర్వినియోగం



అనుమసముద్రంలోని చెత్త సంద తయారీ కేంద్రం

ఏఎస్ పేట, ఆగస్టు 31: గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుండి సేంద్రియ ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని గత టీడీపీ ప్రభుత్వం చెత్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను పట్టించుకోక పోవడంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు చాలావరకు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరాయి.

మండలంలో 19పంచాయతీల్లో..

ఏఎస్ పేట, అనుమసముద్రం, చౌటభీమవరం దాదాపు అన్ని పంచాయతీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వర్మీకంపోస్టు తయారీ చేసేందుకు వానపాములను సైతం తొట్టెలలో ఉత్పత్తి చేసేవారు. వాటి నిర్వహణ పంచాయతీలకు అప్పగించడంతో నిర్వహణ భారమై వాటిని అలాగే వదిలేశారు. అప్పటి నుంచి ఇవి అధ్వానంగా మారాయి. చెత్త పన్ను వసూలు చేయడం నిపివేశారు. దీనితో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం శిథిలం అవుతున్నాయి.

నిరుపయోగంగా యంత్రాలు..: ఏఎస్ పేటలో చెత్తను వేరు చేసి శుద్ధి చేసేందుకు రూ.లక్షలతో కొనుగోలు చేసి తీసుకొచ్చిన యంత్రాలను వినియోగించకపోవడంతో అవి తుప్పుపట్టి శిథిలమై నిరుఉపయోగంగా మారాయి. చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఆకతాయిలకు అడ్డాగా..: చెత్త శుద్ధి కేంద్రాలను గ్రామలకు దూరంగా ఏర్పాటు చేశారు. వాటిని వినియోగించకుండా వదిలేయడంతో అవి ఆకతాయిలకు అడ్డాగా మారాయి. సాయంత్రమైతే మందుబాబులు కేంద్రాలను బార్లుగా వాడుకుంటున్నారు. పలువురు అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరికుంటపాడు: గువ్వాడి గ్రామంలో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీల్లో ఈ కేంద్రాలు నిర్మించారు. అప్పటినుంచి ప్రారంభానికి నోచుకోకుండానే నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో వీటిని పట్టించుకోక పోవడంతో నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి అనుసంధానంగా నిర్మించిన నాడెప్ తొట్టెలు సైతం కంపచెట్లతో నిండిపోయాయి. ప్రజలు తమ నివాసాల నుంచి తీసుకొచ్చిన చెత్తను తొట్లల్లో నింపకుండా ఖాళీ జాగాల్లోనే దిబ్బలుగా వేస్తున్నారు.



వరికుంటపాడు: నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

ఎడతెరపిలేని ముసురు వర్షం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మెట్టప్రాంతంలో శనివారం ఎడతెరిపిలేని ముసురు వర్షం కురిసింది. చలిగాలులు వీయడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిల్వ చేరి బురదమయంగా మారడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ వర్షంతో ఆరుతడి, పండ్ల తోటలకు ఊరట లభించింది.

వరికుంటపాడు: రెండు రోజులుగా వీడకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారమంతా అదే రీతిలో వర్షం కమ్ముకోవడంతో ప్రజలు బయటకు వెళ్లలేక నివాసాలకే పరిమితమయ్యారు. ఆశించిన మేర వర్షం కురవకపోవడంతో కాలనీలు చిత్తడిగా మారాయి. చలిగాలుల ప్రభావంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఏఎస్‌పేటలో సీఐ

ఏఎస్ పేట, ఆగస్టు 31: స్థానిక హజరత్ ఖాజ రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాను శనివారం సంగం సీఐ వేమారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం దర్గా పరిసరాలను పరిశీలించారు. ఎస్ఐ సైదులు సిబ్బంది ఉన్నారు.

సంగం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వేమారెడ్డిని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు తోకల మురళి, కార్యదర్శి చంద్ర నారాయణస్వామి కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో మధులత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఏ గ్రామంలోనైనా అత్యవసరమైతే 91009 48215 నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

రేపటి నుంచి ఉపాధి గ్రామసభలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 31: మండలంలో ఉపాధిహామీ పథకం సామాజిక బృందం తనిఖీల్లో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో బ్రహ్మయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2న రెడ్లదిన్నె, 3న రాచవారిపల్లి, 4న భైరవరం ఏరుకొల్లు, సోమలరేగడ, వెంగన్నపాళెం, నర్రవాడ, 6న దుత్తలూరు, 7న బండకిందపల్లి, పాపంపల్లి, తెడ్డుపాడు, వెంకటంపేట, కొత్తపేట, బ్రహ్మేశ్వరం, నందిపాడు, 8న బోడవారిపల్లి, తిమ్మాపురంలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 31: స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత సభ్యులు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి వాహనం వెంట వారుకడవతో నీరుపోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఆగస్టు 19: మున్సిపాలిటీ పరిధిలోని 2వార్డులో జలదంకి అనురాధ, 22వ వార్డులో రాగి హజరత్తయ్య, మాదాల సుభాషిణి, 23వార్డులోని ఆడిపూడి పోలయ్యలు ఇటీవల మరణించారు. వీరి కుటుంబాలను శనివారం కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

వింజమూరు, ఆగస్టు 31: ఐసీడీసీ కార్యాలయ ఆవరణలో సీడీపీఓ పద్మజకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా రక్తహీనత, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించడం, ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు పిల్లలకు ఇవ్వాల్సిన అనుబంధ పోషక ఆహారం మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఆయిల్‌ఫామ్ రైతులకు సబ్సిడీ అందేలా చూస్తాం

వింజమూరు, ఆగస్టు 31: ఊటుకూరు పంచాయతీలో శనివారం ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, దంతులూరి వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాస్‌నాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

భీమేశ్వరాలయంలో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, ఆగస్టు 31: వంగల్లు కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో శనివారం చండీయాగం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం మహాస్నపనం, ధాన్యాధివాసం, పుష్పశయాధివాసములు, ఆదివాస హోమం, మంగళహారతి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ పగడాల రఘురామయ్య, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భీమేశ్వరాలయంలో జరిగే పునఃప్రతిష్ట కుంబాభిషేకానికి ఆదివారం ఉదయం గం.8-30 గంటలకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు డీపీఆర్వో ఎంవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వినాయకచవితి ఉత్సవాలకు శ్రీకారం

ఆత్మకూరు, ఆగస్టు 31: స్థానిక జెఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ఏరియాలో శనివారం ఉదయం గణేష్ భక్తిమండలి సభ్యులు ధ్వజారోహణతో వినాయకచవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 7వ తేదీ నుంచి మూడురోజుల పాటు ఘనంగా ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గణేష్ భక్తిమండలి సభ్యులు రవీంద్రకుమార్, ఓబుల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజ కార్యక్రమాలు, తీర్థప్రసాదాల వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుపుతామన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గణేష్ భక్తి మండలి సభ్యులు అయ్యన్న, సీవీరెడ్డి, యన్ శ్రీనివాసులు, పద్మనాయుడు పాల్గొన్నారు.



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 31: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న 202పక్కాగృహాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పండ్లతోటల పెంపకానికి సంబంధించి మండలానికి 200ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 75ఎకరాలకు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 125 ఎకరాల లక్ష్యాన్ని ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. మండలానికి మంజూరైన 15నూతన పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేసుకుంటే కూలి

సీతారామపురం: మండలకేంద్రం సమీపంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి పరిశీలించారు. కూలీలు చేస్తున్న పనులు, మస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజు ఉదయాన్నే 6.30 నుండి 11గంటల వరకు పని చేయాలని, యంత్రాలతో పని చేపిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేటాయించిన పనిని కొలతల ప్రకారం చేసుకుంటే రోజుకు 300రూపాయల వరకు వస్తుం దన్నారు. కూలీలకు పనుల గురించి సూచనలు ఇచ్చారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలి

ఆత్మకూరు, ఆగస్టు 31: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌కార్డు కలిగి ఉండాలని ఆర్డీవో మధులత తెలిపారు. శనివారం ఆమె మహిమలూరు గ్రామాన్ని సందర్శించి ఆధార్‌కార్డు లేని ఎస్టీ కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. ఆధార్ నమోదుకు అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్ బాబు, సర్పంచ్ చంద్రశేఖర్, కార్యదర్శి భాస్కర్, వీఆర్వో ప్రతాప్ పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా చేపల వేట సాగిస్తే చర్యలు

అనంతసాగరం, ఆగస్టు 31: సోమశిల జలాశయంలో లైసెన్సు కలిగిన జాలర్లు మాత్రమే చేపల వేట సాగించాలని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బయట వ్యక్తులు చేపల వేటకు వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత వలలు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

బకాయిలు చెల్లించాలని వీవోఏల వినతి

అనంతసాగరం, ఆగస్టు 31: తమకు రావాల్సిన ఆరు నెలల జీతం బాకాయిలు చెల్లించాలని వెలుగు వీవోఏలు శనివారం సీఐటీయూ నాయకులతో కలిసి ఏపీవో రమణరావుకు వినతిపత్రం అందజేశారు. వీవోఏల అక్రమ తొలగింపులను నిలిపివేయాలని వినతిలో పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజాత, లక్ష్మీ, సౌజన్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

అనంతసాగరం, ఆగస్టు 31: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం గ్రామానికి చెందిన గౌస్ అనే వ్యక్తి మద్యం మత్తులో మంచాలపల్లికి చెందిన మరో వ్యక్తిపై కర్రతో దాడి చేశాడు. ఈ దాడితో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దాడికి పాల్పడిన వ్యక్తి గతంలో బస్టాండ్‌లో నిలబెట్టిన కార్లు, ఆటోల అద్దాలు కూడా ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇతని తీరుతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కాలువల ఆక్రమణ.. నిలిచిన మురుగు

- వెంగయ్యగారిపాలెంవాసుల కష్టాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కావలి రూరల్, ఆగస్టు 31: పట్టణంలోని వెంగయ్యగారిపాలెం పరిసరాల్లోని పంట కాలువలు, మురుగునీటి కాలువలను వైసీపీ నేతలు ఆక్రమించారు. దీంతో మురుగునీటి పారుదల లేక రోగాల పాలవుతున్నామని వెంగయ్యగారిపాలెంవాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని వెంగయ్యగారిపాలెం సమీపంలోని కావలమ్మ గుంటను ఆక్రమించడంతోపాటు ఆ గుంటకు వచ్చే నీరు కూడా రాకుండా గోడలు నిర్మించారు. అక్కడ లేఅవుట్లు వేసిన వైసీపీ నేతలు కాలువలు లేని వైపునకు మురుగును మళ్లించి చేతులు దులుపుకున్నారు. తమ పొలాలకు మురుగు మళ్లించటమేంటని రైతులు మురుగునీటి కాలువను పూడ్చివేశారు. దీంతో పట్టణంలో నుంచి వచ్చిన వర్షపునీరు, మురుగునీరు పారుదలకు వీలులేకుండా పోయింది. మురుగునీరు నిల్వ చేరటంతో దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని మురుగు నీటి కాలువల ఆక్రమణలు తొలగించి, మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెంగయ్యగారిపాలెం రోడ్డు పక్కన కాలువలో పొంగిన మురుగు



వెంగయ్యగారిపాలెం సమీపంలో కాలువను ఆక్రమించి కట్టిన గోడ

వర్షంతో భూముల పదును - అన్నదాతల హర్షాతిరేకాలు

జలదంకి, ఆగస్టు31: వరుణుడి కరుణ కోసం ఆకాశానికేసి ఎదురుచూపులు చూస్తున్న అన్నదాతల ఆశలు ఫలించాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో భూములు పదునెక్కి, పంటల సాగుకు అనువుగా తయారయ్యాయి. దీంతో మండల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మాగాణి భూముల్లో పచ్చిరట్టపైర్లు వేసేందుకు అన్నదాతలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. మెట్టభూముల్లో అపరాల పంటలు సాగు చేసే రైతులకు కూడా ఈ వర్షం ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. మండలంలో ఇటీవల అధికంగా సాగుచేసి జామాయిల్ చెట్లకు కూడా ఈ వర్షం ప్రయాజనం చేకూర్చనుంది. పశువులకు, జీవాలకు దాహార్తి తీరేందుకు నీటి వనరుల్లో నీరు చేరనున్నది. కాగా వర్షంతో సోమశిల ప్రాజెక్టులో నీటినిల్వలపై అన్నదాతలు ఆరాతీస్తున్నారు. జలాశయంలో 35 టీఎంసీలకు పైగా నీటినిల్వలు ఉండడంతో మరో 10 టీఎంసీలు అదనంగా చేరితే ఈ ఏడాది వరిసాగుకు ఇబ్బందులు ఉండవని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కొండాపురం మండలంలో చిరుజల్లులు

కొండాపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం మండలంలో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచి బురదమయంగా తయారయ్యాయి. కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిన ప్రజలు చిరుజల్లులతో ఊపిరి పీల్చుకున్నారు.



కొండాపురం : తూర్పుయర్రబల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

● మోస్తరు వర్షానికే రోడ్లపై నీరు

బిట్రగుంట : బోగోలు మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురుస్తున్నది. ఈ వర్షానికే మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లలో నీరు నిలిచింది. నాగులవరం పంచాయతీలో నిత్యం రద్దీగా ఉండే జడ్పీ ఉన్నత పాఠశాల, విలేజ్ హెల్త్ సెంటర్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ చేరాయి.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు



ఊంజల్‌సేవలో స్వామి, అమ్మవార్లు

బిట్రగుంట, ఆగస్టు 31: బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అల్లూరు మండలం ఇందుపూరుకు చెందిన అంబాటి చందు, లక్ష్మీ ప్రసన్న దంపతులు అన్న సంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామి,అమ్మవార్లకు దేవస్థానం వారు ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 9,75,532

వలేటివారిపాలెం, ఆగస్టు 31 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసంహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,75,532 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,950, కుంకుమార్చన ద్వారా రూ. 24,800, వివాహాల ద్వారా రూ. 13 వేలు, తలనీలాల ద్వారా రూ. 49,500, వాహనపూజల ద్వారా రూ. 3,260, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,92,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 700, రూముఅద్దెల ద్వారా రూ. 33,040, కవర్లు ద్వారా రూ. 6,900, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,12,580, అన్నదానం ద్వారా రూ. 3,00092, విరాళాల ద్వారా రూ. 31,116 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

లింగసముద్రం, ఆగస్టు 31 : తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి శనివారం విధుల్లో చేరారు.దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న రీసర్వే డీటీ టీ ప్రసాద్, వీఆర్‌వోలు, ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి

అల్లూరు, ఆగస్టు 31 : పౌరహక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీటీ నాగలక్ష్మి అన్నారు. పట్టణ పరిధిలోని బోడిసత్రం గిరిజనకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహననిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశంలో ప్రతీ ఒక్కరికీ హక్కులున్నాయన్నారు. సమాజంలో స్వేచ్ఛగా జీవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఏ రాజేశ్వరి, వెలుగు ఏపీఎం ప్రసాదరావు, వీఆర్వో రంతుల్లా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి దళితుల సత్కారం

అల్లూరు, ఆగస్టు 31 : ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్‌బాబును అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శనివారం సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి, అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దానం మాల్యాద్రి, ఉయ్యాల జగన్మోహన్‌రావు, గాలి వేణుగోపాల్, దర్శిగుంట వాసు, కర్రా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నలందాలో గ్రీన్‌డే సంబరాలు

కావలిటౌన్, ఆగస్టు31: పట్టణంలోని గొల్లమూడి వీధిలో ఉన్న నలందా హైస్కూల్‌లో శనివారం గ్రీన్‌డే సంబరాలు జరిగాయి. విద్యార్థులు ఆకుకూరలు, పండ్ల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నలందా ఎండీ వసీం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా పరికరాల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 31 : స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు హైస్కూల్ పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త కొట్టే నారాయణ రూ.20 వేల విలువైన క్రీడా పరికరాలను ఉచితంగా అందించారు. శనివారం హైస్కూల్‌లో హెచ్‌ఎం యూ. మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాటిని ఆయన అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తలిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కే ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జేబీలో ముగిసిన క్రీడా పోటీలు

కావలిటౌన్, ఆగస్టు31: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని జేబీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. పీడీ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ముగింపు సభలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జేబీ క్రీడలకు పుట్టినిల్లని, క్రీడాకారులను ప్రోత్సహించడంలో జేబీ యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టీటీ, షటిల్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఫైనల్స్‌లో పోటీపడుతున్న బాలురు

కోదండరామాలయంలో ప్రత్యేక అభిషేకాలు

కలిగిరి, ఆగస్టు 31: మండలంలోని చంద్రారెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన హనుమత్, లక్ష్మణ సీతాసమేత కోదండరామస్వామి ఆలయంలో శనివారం వేదపండితులు నారాయణం శ్రీనివాస దీక్షితుల ఆధ్వర్యంలో క్షీరాధివాస, జలాధివాస అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జనసేన ఆధ్వర్యంలో చీరల పంపిణీ

కావలి, ఆగస్టు31: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా జనసేన వీరమహిళ కందుల లక్ష్మీకవిత ఆధ్వర్యంలో శనివారం ఏరియా వైద్యశాలలో నిశానిటేషన్ విభాగపు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తక్కువ జీతంలో ఏరియా వైద్యశాలలో పారిశుధ్య సేవలు అందిస్తున్న మహిళలకు పవన్ జన్మదినం సందర్భంగా చీరలు అందచేయటం తమకెంతో ఆనందంగా ఉందని జనసేన నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ పద్మావతి, జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య, ఏరియా వైద్యశాల డైరెక్టర్ పొబ్బా సాయివిఠల్, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నాయకులు ఆలా శ్రీనాథ్, గాదంశెట్టి రవికుమార్, జనసేన వీరమహిళలు భవాని, మాధురి తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

నేడు తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన

కావలి,ఆగస్టు31: గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన కావలి- తుమ్మలపెంట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆదివారం ఉదయం తుమ్మలపెంట రోడ్డుకు మహిళలతో శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. ఉదయం 8 గంటలకు కావలి నుంచి పాదయాత్ర చేసుకుంటూ తుమ్మలపెంటకు వెళ్లి, అక్కడ కూడలిలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల కిందట తొలిసారిగా సెప్టెంబరు ఒకటిన బాధ్యతలు చేపట్టడంతో అదే రోజున తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.



తుమ్మలపెంట రోడ్డు దుస్థితి

రైల్వే కార్మికుల షటిల్ పోటీల విజేత కావలి జట్టు

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో కావలి పీడబ్ల్యూఐ సిబ్బంది విజేతలుగా నిలిచారు. బిట్రగుంట యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్ యాదవ్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన పోటీలో కావలి జట్టు ప్రథమ బహుమతి కింద రూ. 3వేలతోపాటు కప్‌ను గెలుచుకుంది. బిట్రగుంట రన్నింగ్ స్టాఫ్ రెండోస్థానంలో నిలిచి రూ.2 వేలను, కప్‌ను, కృష్ణపట్నం సిబ్బంది మూడో స్థానంలో నిలిచి రూ.వేయి నగదుతో పాటు మెమొంటో అందుకున్నారు. విజేతలకు రైల్వేవైద్యులు ప్రభాకర్‌రాజు, కావలి, బిట్రగుంట పీడబ్ల్యూఐలు హుసేన్, కృష్ణన్, వీఎస్ మాల్యాద్రి శుక్రవారం అర్ధరాత్రి జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందచేశారు.

ఉచిత దంత వైద్యశిబిరం

కావలిటౌన్ : స్థానిక వెంగళరావునగర్‌లోని బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం విశ్రాంత సంక్షేమాధికారి ఖాదర్‌బాష పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ శ్యామ్‌సుధాకర్ అధ్యక్షతన ఉచిత దంత వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ వినయ్ వినోద్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, దంతాల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.